PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 53 | పేజీలు : 8 | శనివారం18 జూలై 2026 | వెల : 4/-




## ఆ బిల్లుల ఆమోదమే ప్రభుత్వ ప్రాధాన్యం

- పార్లమెంట్ సమావేశాలపై చీణూ వ్యూహరచన
- దిల్లీలోని కర్తవ్యభవన్‌లో సమావేశమైన ఎన్‌డీఏ కూటమి
- రానున్న వర్షకాల సమావేశంలో ప్రభుత్వ విధివిధానాలపై సాగిన చర్చలు
- ప్రవేశపెట్టబోయే బిల్లులపై కసరత్తు చేస్తున్న కూటమి
- డీలిమిటేషన్‌పై అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామన్న డీఎంకే



## ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఊహించలేని పరిస్థితి

- పంజాబ్ ప్రభుత్వంపై మోదీ ధ్వజం
- ఆప్ ప్రభుత్వంలో నేరగాళ్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజం
- పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగిస్తున్నారని వ్యాఖ్య
- ప్రభుత్వాన్ని నడుపుతున్న పెద్దలు ఆ నిధులను తమ సొంత పనులకు వాడుకుంటూ ప్రజాధనంతో విలాసాలు అనుభవిస్తున్నారు






## తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య పథకం ప్రారంభం

- కొత్తహెల్త్ కార్డులు అందజేసిన మంత్రులు
- సచివాలయంలో నూతన ఈహెచ్‌ఎస్ ప్రారంభ కార్యక్రమం
- ఉద్యోగుల హెల్త్‌కార్డులను ఆవిష్కరించిన భట్టి విక్రమార్క, రాజనరసింహ
- 9.5 లక్షల మంది ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపేలా ఈహెచ్‌ఎస్ తెచ్చామన్న భట్టి

హైదరాబాద్

ఉద్యోగుల సంక్షేమాన్ని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు గత బీఆర్‌ఎస్? ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని, ఇతర ప్రయోజనాలను విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత చికిత్సల కోసం రూపొందించిన ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. నూతన ఈహెచ్‌ఎస్ పోర్టల్, హెల్త్‌కార్డులను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 17లక్షల 88వేల - మిగతా3లో

## ధరణి లావాదేవీలపై విచారణకు సిట్

- ధరణి పోర్టల్ అవకతవకలపై సిట్
- సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ
- ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని నిర్ణయం
- పంచాయతీల ఆదాయం సొంత ఖాతాలోనే జమ చేయాలని నిర్ణయించిన కేబినెట్
- ఇప్పటికే చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో దాదాపు 10 వేలకుపైగా అనుమానాస్పద లావాదేవీలున్నట్లు ప్రభుత్వం గుర్తించింది



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూడు గంటల పాటు సాగిన ఈ భేటీలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ధరణి లావాదేవీలపై సమగ్రవిచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీల ఆదాయం సొంత ఖాతాలోనే జమ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం అనంతరం నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. భూముల రికార్డులు, భూ క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక సిట్? ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపిందని - మిగతా3లో



## ఉచిత హామీలు ఇచ్చే పార్టీల గుర్తింపు రద్దు చేయాలి

- లిస్టింగ్ చేయాలంటూ సుప్రీంను కోరిన పిటిషనర్
- ఉచితాలపై దాఖలైన పిల్‌ను త్వరగా విచారించాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి
- 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం




## మెక్సికోలో భారీ భూకంపం

- మెక్సికో దక్షిణ పసిఫిక్ తీరంలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైన భూకంప తీవ్రత
- గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వరకు కంపించిన భూమి



## పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు

- ఈ నాలుగు అన్యాయాలపైనే పోరాడాలి' : విద్యార్థులతో రాహుల్ గాంధీ
- విద్యార్థులు 4 రకాల అన్యాయాల్ని ఎదుర్కొంటున్నారు:
- డెహ్రాడూన్‌లో ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడిన రాహుల్ గాంధీ
- పేపర్ లీక్స్ నిజాయతీ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని వ్యాఖ్యలు

## అక్టోబరు వరకు లోటు వర్షపాతమే

- గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న రైతాంగం
- రిజర్వాయర్లలో నీటి నిల్వలూ అంతంతే
- సాగునీటి లభ్యత ఆధారంగానే పంటలు వేయాలి
- వరిలో స్వల్పకాలిక రకాలను పండించాలి
- అత్యవసర ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికలో సిఫార్సులు



హైదరాబాద్

తెలంగాణలో వానాకాలం సీజన్ అత్యంత కీలకమైన ఐదు నెలల్లోనూ తీవ్రమైన వర్షాభావ పరిస్థితులే నెలకొని ఉంటాయని ప్రభుత్వం వెల్లడించింది. గత 46 రోజులుగా లోటు వర్షపాతం ఉండగా ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కూడా సాధారణ వర్షపాతం కంటే తక్కువగానే నమోదవుతుందని పేర్కొంది. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాలకు - మిగతా3లో

## తెలంగాణలో పొలిటికల్ తీన్‌మార్!



- తెలంగాణ దంగల్ 2029కి సెమీఫైనల్స్ షురూ..
- మొదటి నుంచీ తెలంగాణ రైజింగ్ అంటున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.
- డెవలప్‌మెంట్ సబ్జెక్ట్‌లో భిన్నాభిప్రాయాలుంటే ఉండొచ్చు.
- పొలిటికల్‌గా మాత్రం తెలంగాణ రైజింగే..!
- దీంతో టాప్‌గేర్‌లోకి వచ్చాయి మూడు పార్టీలు.
- ఎవరి బ్యాటింగ్ వాళ్లు ఆడుతూ, స్కోరు బోర్డును పరుగులెత్తిస్తున్నారు.
- మూడు పార్టీల మధ్య ఒక నంబర్‌గేమ్ కూడా మొదలైంది



## పౌరసత్వ నిర్ధారణకు ఆ పత్రాలు చెల్లవు

- పౌరసత్వానికి భూమి పత్రాలు ఆధారం కాదని కలకత్తా హైకోర్టు తీర్పు
- చౌరబాటు ఆరోపణలతో అరెస్టయిన వ్యక్తి పిటిషన్‌పై విచారణ
- సరైన పౌరసత్వ ధ్రువపత్రాలు సమర్పించాలని పిటిషనర్‌కు ఆదేశం
- ఆధార్, ఓటర్ ఐడీ వంటివి కూడా పౌరసత్వానికి నిశ్చయమైన ఆధారాలు కావని స్పష్టం

నవగీతం
తెలుగు దినపత్రిక

శనివారం
18 జూలై 2026

# ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఊహించలేని పరిస్థితి

పవిత్ర భూమి పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంలో నేరగాళ్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా 20 రాష్ట్రాల్లో అత్యాధునికంగా ఆధునీకరించిన 75 రైల్వేస్టేషన్లను ప్రధాని మోదీ జలంధర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.5,470 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన మోదీ ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో పంజాబ్‌లో అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆరోపించారు. పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని నడుపుతున్న పెద్దలు ఆ నిధులను తమ సొంత పనులకు వాడుకుంటూ ప్రజాధనంతో విలాసాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌లో మార్పును తీసుకురావడం కేవలం బీజేపీ వల్ల సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు. సుసంపన్నమైన పంజాబ్ నిర్మాణానికి కేంద్రం అంకితభావంతో పనిచేస్తుందని మోదీ భరోసా ఇచ్చారు. పంజాబ్‌లో ఈరోజు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని రహస్యమేమీ కాదు. ఇక్కడ జరుగుతున్న ద్రోహపూరితమైన వాస్తవాలను ప్రకటనల ముసుగులో దాచేందుకు ప్రయత్నిస్తున్నారు. పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఎప్పుడు, ఎక్కడ గ్యాంగ్ వార్స్ భగ్గుమంటాయో, ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఎవరూ ఊహించలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ వ్యాపారాలు చేయడం కష్టంగా మారింది. చివరికి పోలీసు స్టేషన్లకు కూడా రక్షణ లేదు. వాటిపై పదేపదే దాడులు జరుగుతున్నాయి. అత్యంత విషాదకరమైన విషయం ఏంటంటే పంజాబ్ భవిష్యత్తు



నాశనమవుతోంది. డ్రగ్స్ విక్రేతలు స్వేచ్ఛగా తిరుగుతూ, పంజాబ్ యువతను వ్యసనాల ఊబిలోకి నెట్టేస్తున్నారు."

**'కట్టర్ బేమాన్' పార్టీ**

పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని 'కట్టర్? బేమాన్ పార్టీ'(అత్యంత అవినీతిపూరిత పార్టీ)గా మోదీ విమర్శించారు. "ప్రజలకు సేవ చేయాలంటే నిజాయతీ ఉద్దేశాలు, సమగ్రతా స్ఫూర్తి అవసరం. అయితే, పంజాబ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీకి ఈ రెండూ లేవు. దానిని కట్టర్ బేమాన్ పార్టీ అని పిలుస్తారు" అని మోదీ అన్నారు. పంజాబ్ యువతకు అత్యంత తీవ్రమైన నష్టం జరుగుతోందని ఆరోపించారు. పంజాబ్ భవిష్యత్తు నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల వ్యాపారులు స్వేచ్ఛగా తిరుగుతూ, పంజాబ్ యువతను వ్యసనం అనే చిత్తడిలోకి లాగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిజాయతీ, సమగ్రత కొరవడ్డాయని మోదీ అన్నారు.

**కేంద్ర నిధుల దుర్వినియోగం**

కేంద్రం ఏళ్ల తరబడి పంజాబ్‌కు భారీ మొత్తంలో డబ్బు పంపిందని, అయితే ఆ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఆరోపించారు. " పంజాబ్ ప్రజలు తమ పథకాలన్నింటి నుంచి ప్రయోజనం పొందేలా కేంద్ర ప్రభుత్వం సాధ్యమైన అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. అయినప్పటికీ, ఈ 'కట్టర్ బేమాన్ పార్టీ' పాలనలో దోపిడీ ఆట సాగుతోంది. గత 12 ఏళ్లలో కేంద్రం పంజాబ్‌కు లక్షల కోట్ల రూపాయల నిధులను పంపింది. పంజాబ్ ప్రభుత్వం ఆ డబ్బును సక్రమంగా వినియోగించడంలో విఫలమైంది. పంజాబ్ పేరుతో రుణాలు తీసుకుంటున్నారు. ఈ అప్పుపై వడ్డీ చెల్లింపులకే రాష్ట్ర బడ్జెట్ ఖర్చవుతుండగా, ప్రభుత్వాన్ని నడుపుతున్న వారు అదే డబ్బుతో విలాసవంతంగా జీవిస్తున్నారు" అని మోదీ ఆరోపించారు. ప్రభుత్వ అధికారులపై దాడి, దోపిడీకి పాల్పడినందుకు ఆప్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గుజరాత్ కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు గురించి మోదీ ప్రస్తావించారు. "కొద్ది రోజుల క్రితమే గుజరాత్‌లోని ఒక కోర్టు వారి ఎమ్మెల్యేలలో ఒకరికి 7 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం, దోపిడీకి పాల్పడినందుకు ఈ శిక్ష విధించారు. దోపిడీ, అక్రమ ఆక్రమణలు వారి రాజకీయ వ్యవస్థకు గుర్తులుగా మారాయి. ఇలాంటి అనేక కేసుల్లో చాలా మంది ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు. పంజాబ్‌నే చూడండి, ఆరోగ్య మంత్రిగా నియమితులైన వ్యక్తిని లంచం కారణంగా తొలగించాల్సి వచ్చింది. ఒక మంత్రి మనీలాండరింగ్ వంటి తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. వారి ఎమ్మెల్యేలు లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నారు. మనం ఇలా లెక్కపెడుతూ పోతే, వారి ప్రభుత్వంలో, పార్టీలో ఎలాంటి మచ్చలేని వారు చాలా తక్కువ మందే మనకు కనిపిస్తారు" అని మోదీ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ గత వాగ్దానాలు, పనితీరును విమర్శిస్తూ, ఆ పార్టీ అసలు రంగులు ఇప్పుడు అందరికీ కనిపించాయని అన్నారు.

# ఆ బిల్లుల ఆమోదమే ప్రభుత్వ ప్రాధాన్యం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ ఎన్?డీఏ ప్రభుత్వం వ్యూహరచనను వేగవంతం చేసింది. ఈ క్రమంలో దిల్లీలోని కర్తవ్య భవన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంత్రుల బృందం కీలక సమావేశం నిర్వహించింది. జులై 20న జరగనున్న పార్లమెంట్ వార్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన విధివిధా నాలు, రెండు ఆర్డినెన్స్‌లను చట్టాలుగా మార్చడంపై ఎన్‌డీఏ కూటమి చర్చించింది. ముఖ్యంగా ఆదాయపు పన్నుసవరణ బిల్లు, గతంలో నెగ్గని డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లులను మళ్లీ పార్లమెంట్ ముందుకు తెచ్చేందుకు ఎన్?డీఏ కసరత్తు చేస్తోంది. మరోవైపు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ, పశ్చిమాసియా ఘర్షణల్లో భారతీయ నావికుల మృతి, అయోధ్య రామాలయ విరాళాల్లో అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

**ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' పేరు**

జులై 21న జరగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' అని ఎన్?డీఏ పేరు పెట్టింది. పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో ఉదయం 9:30 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన ఎన్?డీఏ ఎంపీలందరూ హాజరుకానున్నారు. ప్రభుత్వ శాసనపరమైన అజెండా నేపథ్యంలో ఎన్?డీఏ నాయకుల ఈ సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గతంలో ప్రకటించినట్లుగా, ఆగస్టు 13 వరకు కొనసాగే వర్షాకాల సమావేశాల్లో పలు ముఖ్యమైన బిల్లులను చేపట్టే అవకాశం ఉంది.

ఇదిలా ఉండగా, డీలిమిటేషన్ బిల్లుపై డీఎంకే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల పునర్విభజనపై కేంద్రం బిల్లు పెడితే అధ్యయనం చేసి, తమిళనాడు ప్రయోజనాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. బిల్లు పరిధి, లక్ష్యాలు తెలిసిన తర్వాత విశ్లేషించి నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు తెలిపాయి.



తమిళనాడు ప్రయోజనాలు కాపాడేందుకు డీఎంకే తీసుకునే నిర్ణయం స్వతంత్రంగా ఉంటుందని ఆ పార్టీ వర్గాలు వివరించాయి. డీలిమిటేషన్‌పై వర్షాకాల సమావేశాల్లో పెట్టే బిల్లు స్వతంత్ర చట్టంగానే ఉండే అవకాశం ఉందని, ఇతర చట్టాలతో కలిపి ఉండదని భావిస్తున్నట్లు తెలిపాయి. 50 శాతం సీట్ల పెంపు, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల పంపిణీ నిష్పత్తిని అలాగే కొనసాగించడం తదితర వంటి అంశాలు చర్చలో ఉన్నాయని పేర్కొన్నాయి. జులై 16న జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో డీలిమిటేషన్‌పై చర్చ జరిగింది. లండన్‌లో ఉన్న డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. హస్తం పార్టీతో పొత్తులేనందున బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండా స్వతంత్రంగానే నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు వివరించాయి.

**డీఎంకే, ఇండి కూటమిపై జైరాం రమేశ్ కీలక వ్యాఖ్యలు**

మరోవైపు, డీఎంకే, ఇండి కూటమికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్? మాట్లాడారు. "బీజేపీ, డీఎంకేల సిద్ధాంతాలు వేర్వేరు కాబట్టి అవి ఎప్పటికీ కలిసి పనిచేయలేవు. 8వ తేదీన జరిగిన ఇండి కూటమి సమావేశానికి డీఎంకే హాజరుకాలేదన్నది, అలాగే మేము టీవీకేకి మద్దతు ఇస్తున్నామన్నది వాస్తవమే. ప్రభుత్వంలో మాకు ఇద్దరు కేబినెట్ మంత్రులు కూడా ఉన్నారు. మేం డీఎంకే ఎంపీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం, చర్చలు కొనసాగుతున్నాయి. డీఎంకే ఇప్పటికీ ప్రతిపక్ష పార్టీయే తప్ప, అధికార పక్షం లేదా ఎన్?డీఏలో భాగం కాదు. స్టాలిన్ చేసిన ప్రకటనలను నేను చదివాను, బీజేపీ, డీఎంకేల మధ్య ఎలాంటి ఒప్పందం లేదని స్పష్టమవుతోంది. సరైన సమయం వచ్చినప్పుడు డీఎంకే కచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా నిలబడుతుందని నాకు నమ్మకం ఉంది" అని జైరాం రమేశ్? వ్యాఖ్యానించారు.

## పౌరసత్వ నిర్ధారణకు ఆ పత్రాలు చెల్లవు



పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి కేవలం భూమి లేదా ఆస్తి పత్రాలు మాత్రమే సరిపోవని కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చట్టవిరుద్ధమైన చొరబాటు ఆరోపణల ఉన్నప్పుడు ఇలాంటి పత్రాలకు ఎటువంటి చట్టపరమైన బలం ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది. దేశంలో పౌరసత్వ నిర్ధారణకు సంబంధించి అనుసరిస్తున్న న్యాయపరమైన వైఖరిని ఈ తీర్పు మరోసారి ప్రతిబింబించింది. చొరబాటుదారుడనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్ పోలీసులు నసీర్ మొల్లా అనే వ్యక్తిని అరెస్ట్ చేసి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. రాష్ట్రంలో తాను భూమి కొనుగోలు చేశానని, కాబట్టి తనను భారత పౌరుడిగా గుర్తించాలని కోరుతూ అతని బంధువులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలను విన్నది. అయితే, విచారణలో తాను విదేశీయుడినని నిందితుడే స్వయంగా అంగీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో, ఆస్తి పత్రాలను పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమని తేల్చి చెప్పిన కోర్టు, తగిన ఆధారాలను 2026 జూలై 20లోగా సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అంతవరకు నసీర్ మొల్లా డిటెన్షన్ సెంటర్‌లోనే కొనసాగుతారని స్పష్టం చేసింది. భారతదేశంలో ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, పాన్ కార్డు లేదా నివాస ధ్రువపత్రాలను పౌరసత్వానికి ప్రామాణికమైన ఆధారాలుగా పరిగణించలేమని గతంలో గౌహతి హైకోర్టు వంటి న్యాయస్థానాలు కూడా స్పష్టం చేశాయి. 1955 పౌరసత్వ చట్టం నిబంధనల ప్రకారమే పౌరసత్వాన్ని నిర్ధారించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా న్యాయ నిపుణులు గుర్తుచేస్తున్నారు.

## మెక్సికోలో భారీ భూకంపం..




మెక్సికో దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చోటుచేసుకున్న ఈ భూప్రకంపనల ప్రభావం మెక్సికో సిటీతో పాటు ఎల్ సాల్వడార్ వరకు విస్తరించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.3గా నమోదైంది. చియాపాస్ తీరానికి సమీపంలోని అఖిలెస్ సెర్డాన్‌కు నైరుతి దిశగా 48 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 15 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రధాన భూకంపానికి ముందు సముద్ర గర్భంలో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. భూకంప తీవ్రతకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. మెక్సికో, గ్వాటెమాలా సరిహద్దుల్లోని సుచియాటే నగరంలో సునామీ ముప్పు పొంచి ఉందనే అనుమానంతో తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ ఎల్మర్ పేర్కొన్నారు. మెక్సికో దక్షిణ సరిహద్దులోని కీలక నగరమైన టపచులాలో తొలుత స్వల్పంగా ప్రారంభమైన ప్రకంపనలు, కొద్దిసేపటికే తీవ్రరూపం దాల్చాయి. "మేము ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న సమయంలో భూమి కంపించడం మొదలైంది. తొలుత ఇది సాధారణ ప్రకంపనలే అని భావించాం, కానీ తీవ్రత పెరగడంతో అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చేశాం" అని ఓ ఉద్యోగిని అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధికి వివరించారు. గ్వాటెమాలా సిటీలో భూప్రకంపనలు దీర్ఘకాలం పాటు కొనసాగడంతో జనం ఆందోళన చెందారు. మెక్సికో సిటీలోని పలు ప్రాంతాల్లో భవనాలు ఒక్కసారిగా ఊగిపోయాయి. అయితే, భూకంపం సంభవించిన ప్రారంభ క్షణాల్లో దాని తీవ్రత నిర్దేశిత పరిమితిని మించకపోవడం వల్ల ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ మోగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాదూన్‌లో నిర్వహించిన 'ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గర్జన)' కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నేరుగా సంభాషించారు. దేశంలో విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ, పేపర్ లీక్స్, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, యువత ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ఇది రాజకీయ సభ కాదని, విద్యార్థుల భవిష్యత్తు, వారి పోరాటం, విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశం అని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రస్తుతం నాలుగు ప్రధాన సమస్యల్ని, అన్యాయాల్ని ఎదుర్కొంటున్నారని రాహుల్ గాంధీ అన్నారు. మొదటిది చదువులకు ఖర్చు భారీగా పెరగడం, రెండోది యువతకు అందుబాటులో ఉండే 5 అవకాశాల్లో నాలుగు మార్గాల తలుపులు మూసుకుపోవడం, మూడోది వందలాది మంది పోటీపడినా ఒకరికో, ఇద్దరికో విజయం దక్కడం, నాలుగోది అత్యంత ప్రమాదకరమైన పేపర్ లీకులు అని పేర్కొన్నారు. వీటిపై పోరాడాలని పిలుపునిచ్చారు.

**ఉపాధి లేకపోవడానికి కారణాలివే!**

దేశంలో యువతకు ప్రతి 5 అవకాశాలకు 4 అవకాశాల తలుపులు మూసుకుపోయాయి. మొదటిది, భారతదేశంలో తయారీ రంగం పూర్తిగా నిలిచిపోయింది. చైనా ఉత్పత్తులే భారత మార్కెట్‌ను ఆక్రమించడంతో ఉపాధి అవకాశాలు తగ్గాయి. రెండోది– వ్యాపారం చేయాలనుకునే యువతకు బ్యాంక్ రుణాలు సులభంగా అందట్లేదు. బ్యాంక్ నిధులు కొద్ది మంది పెద్ద పారిశ్రామిక వేత్తలకే పరిమితమయ్యాయి. మూడోది– కృత్రిమ మేధ ప్రభావంతో ఐటీ, కార్పొరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయి. నాలుగోది– ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఆ తలుపులు కూడా మూసేశారు. చివరగా ప్రభుత్వ ఉద్యోగాలే యువతకు మిగిలిన చివరి అవకాశం అయింది. అంతా ఈ డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. అయితే కోట్లాది మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరీక్షలు రాస్తున్నప్పటికీ, చివరికి కొద్దిమందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. సుమారు 6 కోట్ల మంది ఈ ఒక్క డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. కానీ అందులో లక్షల మందికే అవకాశం వస్తోంది. మిగిలిన వారు నిరాశకు గురవుతున్నారు. ఇక్కడ పోటీ తీవ్రతతో పాటు విద్య ఖర్చు, పేపర్ లీక్స్ యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి.' అని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు.

దేశంలోని పరీక్షల నిర్వహణ వ్యవస్థ, పేపర్ లీక్‌లపై ఈ వేదికగా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పరీక్ష ప్రశ్నపత్రాల లీక్స్ కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాలు టెలిగ్రామ్, సిగ్నల్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారంలలో అందుబాటులో ఉంటున్నాయని, అయితే వాటిని పొందాలంటే కోట్ల రూపాయలు చెల్లించే స్థోమత ఉండాలని వ్యాఖ్యానించారు. ఇదే ప్రస్తుతం భారతదేశ విద్యా వ్యవస్థ పరిస్థితి అని దుయ్యబట్టారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, సగటున ప్రతి నెల ఒక పేపర్ లీక్ అయినట్లేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఘటనల కారణంగా సుమారు 7.5 కోట్ల మంది యువత నష్టపోయారని వ్యాఖ్యానించారు. వరుస పేపర్ లీక్స్ జరుగుతున్నా ఇప్పటికీ ఒక్క కేసులో కూడా శిక్ష పడలేదని, ఒక్క వ్యక్తి కూడా జైలుకు వెళ్లలేదని రాహుల్ ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దందా మరింత పెరుగుతోందని అన్నారు.

**'పేపర్ లీక్స్‌తో నిజాయతీ విద్యార్థులకే నష్టం'**

'వ్యవస్థను కేవలం ఒక శాతం మంది మాత్రమే దుర్వినియోగం చేస్తున్నారు. కానీ దాని ప్రభావం నిజాయతీగా చదివే 99.9 శాతం మంది పేద, మధ్యతరగతి విద్యార్థులపై పడుతోంది.' అని రాహుల్ గాంధీ అన్నారు. ఇక విద్యార్థుల ముందున్న రెండు మార్గాల్ని వివరిస్తూ– ఒకటి నిజాయతీ, కష్టపడి చదివే మార్గమైతే; మరొకటి డబ్బు, అవినీతి, మోసాల ద్వారా పేపర్ లీక్ మార్గం అని వ్యాఖ్యానించారు. ఈ మార్గంలో వెళ్లాలంటే– మధ్యతరగతి లేదా పేద కుటుంబానికి చెందినవారిగా ఉండకూడదని, నిజాయతీ అవసరం లేదని అన్నారు. అయితే 99.9 శాతం మంది విద్యార్థులు నిజాయతీ మార్గాన్నే ఎంచుకుంటున్నారని, కొందరు మాత్రమే వ్యవస్థను దుర్వినియోగం చేసి అందరినీ నష్టపరుస్తున్నారని అన్నారు.

## ఉచిత హామీలు ఇచ్చే పార్టీల గుర్తింపు రద్దు చేయాలి

ఎన్నికలకు ముందు ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ప్రకటించే 'ఉచిత పథకాల' అంశం మరోసారి సుప్రీంకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. ప్రజాధనంతో అర్థరహితంగా ఇచ్చే ఉచిత హామీలు లేదా పంపిణీ చేసే రాజకీయ పార్టీల గుర్తును స్వాధీనం చేసుకోవాలని, అవసరమైతే వాటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) త్వరగా విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని న్యాయవాది, పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ్ ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై ఇప్పటికే 2022లో కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఫిబ్రవరి 5న కూడా అత్యవసర విచారణ కోసం ఈ అంశాన్ని ప్రస్తావించామని, మార్చిలో విచారణకు అంగీకరించినప్పటికీ ఇంకా జాబితాలోకి రాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, ప్రస్తుతం కోర్టులో భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ అంశం కొంతకాలం వేచి ఉండాలని వ్యాఖ్యానించారు. దీంతో విచారణకు వెంటనే తేదీ ఖరారు కాలేదు. దీనికి స్పందించిన అశ్విని ఉపాధ్యాయ్, ఈ సమస్య దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుందని, దీనిపై అధ్యయనం చేసేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుపక్షాలు కూడా దీనికి అంగీకరించాయని ఆయన ధర్మాసనానికి వివరించారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా ఈ పిటిషన్‌పై త్వరిత విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు.

**2022లోనే నోటీసులు**

ఇదే అంశంపై 2022 జనవరి 25న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత హామీలు దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో వివరించాలని కోరింది. ఆ సమయంలో ధర్మాసనం ఈ అంశాన్ని "తీవ్రమైన సమస్య"గా అభివర్ణించింది. కొన్ని రాష్ట్రాల్లో ఉచిత పథకాల కోసం కేటాయిస్తున్న నిధులు సాధారణ బడ్జెట్ కంటే ఎక్కువగా మారుతున్నాయని కూడా వ్యాఖ్యానించింది. ఎన్నికల సమయంలో ప్రజాధనంతో సంబంధం లేని ఉచిత వస్తువులు, సేవలను ప్రకటించడం ద్వారా రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధమని, ఎన్నికల ప్రక్రియ పవిత్రతను దెబ్బతీస్తుందని పిటిషనర్ వాదించారు. అందుకే ఎన్నికల ముందు ఇలాంటి ఉచితాలను ప్రకటించే లేదా పంపిణీ చేసే పార్టీల ఎన్నికల గుర్తును రద్దు చేయాలని, అవసరమైతే పార్టీ రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ప్రత్యామ్నాయంగా, ఈ అంశంపై స్పష్టమైన చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. 1968లో రూపొందించిన 'ఎన్నికల చిహ్నాల (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్'లో సవరణలు చేయాలని కూడా పిటిషన్?లో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రజాధనంతో ఉచితాలు ప్రకటించకూడదనే నిబంధనను రాజకీయ పార్టీల గుర్తింపుకు సంబంధించిన అర్హతల్లో చేర్చాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు.

**రాజ్యాంగ విరుద్ధమని వాదన**

ప్రజా ప్రయోజనాలకు సంబంధం లేని వస్తువులు లేదా సేవలను ప్రజాధనంతో వాగ్దానం చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)తో పాటు ఆర్టికల్స్ 162, 266(3), 282లను కూడా ఉల్లంఘిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజాధనాన్ని ఎన్నికల లబ్ధి కోసం వినియోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వాదించారు. అధికారంలో కొనసాగాలనే ఉద్దేశంతో ప్రజాధనాన్ని వినియోగించి ఉచితాల హామీలు ఇవ్వడం, ఓటర్లకు లంచం ఇచ్చినట్లేనని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, అలాంటి ప్రక్రియను డబ్బు, ఉచిత హామీలతో ప్రభావితం చేయడం అత్యంత ప్రమాదకర ధోరణి అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ధరణి లావాదేవీలపై విచారణకు సిట్

-మొదటిపేజీ తరువాయి

మంత్రి పొంగులేటి తెలిపారు. 2020 అక్టోబర్ 29 నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందని వివరించారు.

ఇప్పటికే చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో దాదాపు 10 వేలకుపైగా అనుమానాస్పద లావాదేవీలున్నట్లు ప్రభుత్వం గుర్తించిందని వివరించారు. అందుకే భూముల లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులు, లాగిన్ వివరాలు, రికార్డుల్లో చేసిన మార్పులు, అధికారుల అనుమతులు, భూముల వర్గీకరణ మార్పులు, లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. ధరణిలో పోర్టల్ తర్వాత కొన్ని మాడ్యుల్స్ మార్చి రైతులకు ఉపయోగంగా ఉండేలా తమ ప్రభుత్వం భూభారతి అమల్లోకి తెచ్చిందని పొంగులేటి తెలిపారు. ఇప్పటికీ ఆనాడు సాఫ్ట్ వేర్ రూపకల్పన చేసిన పోర్టల్ లో ఉన్న లోపాలతో అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. అందుకే ధరణి వ్యవహారంలో బాధ్యులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సిట్ వేసి బాధ్యులను గుర్తించాలని నిర్ణయించిందని వివరించారు.



### వర్షాభావ పరిస్థితులపై కేంద్రానికి లేఖరాయాలని నిర్ణయం

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్?నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. పంటల సాగు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభావం, తాగునీరు సాగునీటి ఇబ్బందులు, ఉపాధి కూలీల పరిస్థితులను సమగ్రంగా వివరిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని, ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని చెప్పారు.

### తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో దాదాపు 40 శాతం వర్షపాతం లోటు ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారన్నారు. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నందున, అన్ని శాఖలు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు చేసే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును రైతులు నివారించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు కేబినేట్ విజ్ఞప్తి చేసింది.

### ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సదస్సులు

ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించింది. రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావంపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించింది.

అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, వెంటనే చేపట్టాల్సిన చర్యలను తెలుసుకునేందుకు అత్యవసర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెల 20వ తేదీ సోమవారం ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అక్కడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లా ఇన్ ఛార్జీ మంత్రితో పాటు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఈ ప్రకృతి గండం నుంచి గట్టెక్కేందుకు అన్ని శాఖలు సన్నద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ, సమన్వయంతో పనిచేసి వర్షాభావ సంక్షోభాన్ని అధిగమించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

### మరిన్ని కీలక నిర్ణయాలు ఇవే :

టెండర్ల ప్రక్రియ కోసం ప్రత్యేక చట్టం చేయాలని కేబినెట్ నిర్ణయం

అన్ని శాఖల్లో టెండర్ల ప్రక్రియ ఒకే తీరుగా ఉండేలా చట్టం తేవాలని నిర్ణయం

పంచాయతీల సొంత ఆదాయాన్ని గ్రామ పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలని కేబినెట్ నిర్ణయం

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ట్రాన్స్ జెండర్లను కో-ఆప్షన్ సభ్యులుగా నియమించాలని నిర్ణయం

ఇందుకోసం మున్సిపాలిటీస్ చట్టం--2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది

శంషాబాద్ సమీపంలో రైల్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్--పుణె--ముంబైకి ఒక రూట్, హైదరాబాద్--బెంగుళూరు మరో రూట్, హైదరాబాద్--అమరావతి--తిరుపతి--చెన్నై మరో రూట్ బుల్లెట్ రైళ్లకు కేంద్రం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ముక్తేశ్వర్ ఎత్తిపోతల పథకం (చిన్న కాళేశ్వరం) పూర్తి చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గోదావరి నదిపై కన్నెపల్లి నుంచి 4.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి మంథని నియోజకవర్గంలో 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ఈ పథకం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయిచింది. ఇప్పటికే పూర్తయిన పనులను అంచనా వేసుకొని, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలిపింది.

# తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య పథకం ప్రారంభం

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి డిపెండెంట్లకు నేటి నుంచి 1816 వైద్య, శస్త్రచికిత్సలకు నగదు రహిత సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఓపీ సేవల కోసం ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా త్వరలో మరో 24 ప్రారంభించనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా వెల్లడించారు.




### ప్రభుత్వ ఉద్యోగులకు భరోసా నిచ్చే పథకం

ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం సరికొత్త అధ్యాయానికి శ్రీకారమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు భరోసా కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఆరోగ్య భద్రత వ్యవస్థను అందించాలనే సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం కొత్త ఈహెచ్‌ఎస్ ను రూపొందించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని మార్చి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో కోటీ 6లక్షల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయన్నాని వివరించారు.

ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5లక్షల రూపాయల నుంచి రూ.10లక్షలకు పెంచినట్లు భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాల ద్వారా ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి పాల్గొన్నారన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన సుమారు రూ.10వేల కోట్ల బిల్లులు పెండింగులో పెట్టిందన్న భట్టి విక్రమార్క, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతీ నెలా నిధులు విడుదల చేస్తూ పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తున్నామన్నారు. ఉద్యోగుల మెడికల్ బిల్లులను మానవీయ కోణంలో చూస్తూ ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నట్లు వివరించారు.

### 886 ఆస్పత్రుల్లో నగదురహిత చికిత్స

ఉద్యోగులు, పెన్షనర్ల అభిప్రాయాల మేరకు సమర్థవంతమైన, పారదర్శకమైన న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ రూపొందించినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. గతంలో ఈహెచ్‌ఎస్ ప్యాకేజీ రేట్లు తక్కువగా ఉన్నందున సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు భాగస్వామ్యం కాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 38 వేల 594 ప్రభుత్వ ఉద్యోగులు, 361955 పెన్షనర్లు సుమారు 9.88లక్షల కుటుంబ సభ్యులు ఉన్నారని మంత్రి వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్ల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం చెల్లిస్తుందని, ప్రతీ పైసాను ఈహెచ్‌ఎస్ అమలు కోసమే వినియోగిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహా స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్ హాస్పిటల్స్‌తో పాటు 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1,816 వైద్య, శస్త్రచికిత్సలకు నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

"ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం ప్రారంభించడం రాష్ట్ర ప్రభుత్వానికి, లక్షలాది మంది ఉద్యోగులు, కుటుంబసభ్యులు, పెన్షనర్లకు సంతోషకరమైన శుభవార్త. భవిష్యత్?లో ఎటువంటి టెన్షన్? లేకుండా, ఎలాంటి అనారోగ్య పరిస్థితి ఏర్పడినా వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. అందువల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే నమ్మకం, ధైర్యం ఉద్యోగికి, వారి కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా ఏర్పడుతుందని చెప్పడానికి సంతోషిస్తున్నాం"-భట్టి విక్రమార్క, ఉపముఖ్యమంత్రి

### అత్యాధునిక వైద్య సేవలు పొందే అవకాశం

అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కామినేని, కాంటినెంటల్, కేర్, స్టార్, బసవతారకం వంటి ప్రముఖ కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లలోనూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు అత్యాధునిక వైద్య సేవలు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ డిజిటల్ హెల్త్ కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ప్రీ-ఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు మొత్తం ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓపీ సేవల కోసం ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. నూతన ఈహెచ్‌ఎస్ ప్రారంభంపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు బీఎండీ ఎక్కా, క్రిస్టినా, యోగిత రాణా, సందీప్ కుమార్ సుల్తానియా, ఈహెచ్‌సీటీ సభ్యులు, పాల్గొన్నారు.

# ఉప్పల్ భగాయత్ ఫేజ్-2లో ట్రాఫిక్ కష్టాలు

## తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

ఉప్పల్ భగాయత్ ఫేజ్-2 ట్రాఫిక్ కష్టాలతో సతమతమవుతోంది. ఓవైపు ఉప్పల్-నార్లపలి ఎలివేటెడ్ కారిడార్ పనులతో వాహనాలు మళ్లింపుతో రద్దీ పెరగ్గా మరోవైపు ప్రధాన రహదారిపై గణేశ్ విగ్రహాల విక్రయాల వల్ల మరిన్ని ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటోంది. ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పిల్లలు స్కూల్స్‌కు, పెద్దలు ఆఫీస్‌లకు వెళ్లేటప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ భగాయత్ ఫేజ్-2 ప్రధాన రహదారి గుండా వేలాదిమంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు నాగోల్, రామంతపూర్‌కు వెళ్లేందుకు షార్ట్ కట్ కూడా. ఇప్పటికే ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనుల వల్ల చాలా వాహనాలను ఇటువైపు మళ్లించారు. ఫలితంగా ఈ రహదారిలో మరింతగా వాహనాల రద్దీ పెరిగిపోయింది. దీనికి తోడు ప్రధాన రహదారి వెంబడి భారీ వినాయక విగ్రహాలు విక్రయాలు జరగడం వల్ల భగాయత్ ఫేజ్-2కు మరిన్ని ట్రాఫిక్ కష్టాలు తెచ్చిపెట్టింది. ఏటా వినాయక చవితి సందర్భంగా ప్రధాన రహదారి వెంబడి గణేష్ విగ్రహాల తయారీ, విక్రయాలకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. విగ్రహాలను కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు వాటిని తరలించేందుకు భారీ వాహనాలు తీసుకొచ్చి ఎక్కడపడితే అక్కడే నిలుపుతారు. దీనితోపాటు రోడ్డును ఆక్రమించి చిరు వ్యాపారులు అమ్మకాలు జరుపుతున్నారు.

# తెలంగాణలో పొలిటికల్ తీన్‌మార్!

ఒకటి గమనించారా? నాటకీయమా, యాదృచ్ఛికమా, కాకతాళీయమా.. ఏదైతేనేం.. ఢిల్లీలో ఒక చిన్నసైజు అద్భుతమైతే జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి ఢిల్లీలోనే మకాం పెట్టారు. పైగా, ఇద్దరూ అభివృద్ధే తమ ఎజెండా అని ఒట్టేసి చెప్పుకున్నారు. రోడ్ల మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రీజినల్ రింగురోడ్డుపై అప్‌డేట్ తీసుకుని, విమానాల మంత్రి రామ్మోహన్‌ని కలిసి వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులపై క్లారిటీ అడిగి, తెలంగాణలో పెండింగ్ ప్రాజెక్టులను పట్టాలెక్కించడానికి జల పంచాయతీలు చేశారు సీఎం రేవంత్. అదే టైమ్‌లో అదే ఢిల్లీలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తన రూటూ డెవలప్‌మెంటే అన్నారు. ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి ఆదిలాబాద్ జజ×ని పునరుద్ధరించాలని కోరారు. తెరిపించేదాకా నిద్రపోనన్నారు. పని ముఖ్యం-ఆ తర్వాతే పాలిటిక్స్ అని రేవంత్ అండ్ కేటీఆర్ ఇద్దరూ గతంలో ప్రామిస్ చేసినవాళ్లే. కానీ, ఈ పని వెనుక ఆ పాలిటిక్స్ కూడా ఉన్నట్టేనా? ఢిల్లీ టూర్ల బ్యాక్‌డ్రాప్‌లో గల్లీ ప్రయోజనాలేమైనా ఉన్నాయా? అంటే.. అవుననే అంటోంది ఎనలిస్టుల వాయిస్. తెలంగాణలో సెమీఫైనల్స్ షురూ ఐనట్టేనట..! అవును, రెండేళ్లకు ముందే తెలంగాణ దంగల్‌కి దండోరా మోగింది. కాంగ్రెస్-బీఆర్ఎస్-బీజేపీ.. మూడూ పార్టీలూ పెర్ఫామెన్స్‌లు రీచెక్ చేసుకుంటూ, ఎవరికి వాళ్లు సిబిల్ స్కోర్లు సరిచూసుకుంటున్నారు. సొంత సర్వేలు చేయించుకుంటున్నారు. అందులో కొన్ని ఇంటర్నల్ సర్వేలు, కొన్ని ఎక్స్‌టర్నల్ సర్వేలు. తమకు అనుకూలమైన నంబర్లు వచ్చేదాకా సర్వేలు ఆపేదే...

# అక్టోబరు వరకు లోటు వర్షపాతమే

-మొదటిపేజీ తరువాయి

సంబంధించిన సీజనల్ వర్షపాతం కూడా సాధారణం కంటే తక్కువగా ఉంటుందని తెలిపింది. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని, ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల విస్తీర్ణాన్ని పెంచకూడదని స్పష్టం చేసింది. సాధ్యమైనంత వరకు తక్కువ కాలంలో పూర్తయ్యే, కరవును తట్టుకునే రకాలను ఎంచుకోవాలని సూచించింది. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు గురువారం విడుదల చేసిన అత్యవసర ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళిక-2026లో ఈ వివరాలను వెల్లడించింది.

### 25 శాతం తక్కువ వర్షపాతం

తాజా సీజనల్ అంచనా ప్రకారం వానాకాలంలో రాష్ట్రంలో సాధారణం కంటే సుమారు 25 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల తెలంగాణలో నైరుతిలో వర్షపాతం బలహీన పడే అవకాశం ఉంది. జులైలో సాధారణం కంటే సుమారు 25 శాతం, ఆగస్టులో 15, సెప్టెంబరులో 42, అక్టోబరులో 55 శాతం లోటు వర్షపాతం నమోదవుతుంది.

### ప్రాజెక్టుల్లో

గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని అన్ని ప్రధాన, మధ్యతరహా రిజర్వాయర్లలో ప్రస్తుతం 27.69 టీఎంసీలు, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని అన్ని ప్రాజెక్టుల్లో కలిపి ప్రస్తుతం 14.81 టీఎంసీలు మాత్రమే వినియోగించడానికి నీటి నిల్వ అందుబాటులో ఉంది. ఇది ప్రధానంగా తాగునీటి అవసరాలను తీర్చడానికి మాత్రమే సరిపోవడం గమనార్హం. మిగిలిన రుతుపవన కాలంలో పెద్ద ఎత్తున నీటి ప్రవాహాలు రిజర్వాయర్లలోకి చేరకపోతే, అనేక రిజర్వాయర్ల నుంచి సాగునీటిని విడుదల చేసే అవకాశం కనుచూపు మేర కూడా కనిపించదు.

### ఏం పంటలు వేయాలంటే

గ్రామాల్లో చెరువులు నిండితేనే ఈ నెలాఖరు వరకు వరి స్వల్పకాలిక రకాలను సాగుచేయాలి. మొక్కజొన్న హైబ్రిడ్ రకాలను వాడితేనే మంచిది. కందులు, రాగులు, శనగలు, సజ్జలు, ఉలవలు, నువ్వులు, ఆముదాలు వేయాలి. ఈ నెల 20 వరకే పత్తి విత్తనాలు సాగు చేయాలి.

### పొదుపుగా నీటి వినియోగం

సాగునీటిని పంట పొలాల్లో అత్యంత పొదుపుగా వినియోగించాలి. వర్షపు నీటిని పొలంలోనే నిల్వచేసే తేమ సంరక్షణ పద్ధతులను అవలంబించాలి. క్షేత్ర స్థాయిలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు కూడా చేపట్టాలి. బిందు, తుంపర సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను వాడటం వల్ల నీటిని చాలా మేరకు ఆదా చేయవచ్చు.

రాష్ట్రంలో ప్రస్తుతం పత్తి రైతులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే మొలకెత్తిన పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగానైనా వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఈసారి లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. మొత్తం పత్తి సాగు లక్ష్యం 47.31 లక్షల ఎకరాలకుగాను ఇప్పటి వరకు 40.92 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నెల రోజుల పంటలో వచ్చిన మొక్కలకు ఎదిగే దశలో ప్రతీ 5 రోజులకోసారి నీటి తడి అవసరం చాలా కీలకం. కీలకమైన దశలో రెండు వారాలుగా చుక్క వాన నీరు అందలేదు. ఈ వారంలోనైనా వర్షాలు కురవకపోతే పత్తికి ప్రమాదమేనని నిపుణులైన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో రైతులు తమ పంటను చూసి తల్లడిల్లిపోతున్నారు.

# సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్




బీఆర్ఎస్ రేపు సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. శాంతియుతంగా ఈ సదస్సు నిర్వహించుకోవాలని హైకోర్టు ఆదేశించింది. రహదారుల దిగ్బంధం, రెచ్చగొట్టే విధానం ఉండొద్దని హైకోర్టు స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే,

### సభకు పోలీసుల నిరాకరణ

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రేపు బీఆర్ఎస్ సదస్సు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుంది. యువ సంగ్రామ సదస్సు పేరుతో దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ నేతలు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్?పై జస్టిస్ టి.మాధవీ దేవి విచారణ చేపట్టారు.

### వారు పాల్గొంటాని సమాచారంతోనే

నిరుద్యోగ జేఏసీగా పిలుస్తున్న కొంత మంది ఈ సదస్సులో పాల్గొంటున్నారని పోలీసులకు సమాచారం అందిందని, గతంలో వీళ్లపై పోలీసు కేసులు నమోదయ్యాయని హోంశాఖ జీపీ మహేశ్ రాజే తెలిపారు. నిరుద్యోగ జేఏసీకి బీఆర్ఎస్ ఆర్థిక సహకారం అందిస్తూ గత కొన్ని నెలలుగా ధర్నాలు, రాస్తారోకోలు చేయిస్తోందని మహేశ్ రాజే వాదించారు. సదస్సు పేరుతో జాతీయ రహదారి దిగ్బంధించే అవకాశం ఉందని శాంతిభద్రతల సమస్య తలెత్తొచ్చని చెప్పారు. ఇప్పటికే ఇంటిలిజెన్స్ అధికారులు కూడా నివేదిక ఇచ్చారని కోర్టుకు తెలిపారు.

### ప్రతి సభకు అడ్డంకులు

లేనిపోని సాకులు చూపిస్తూ ప్రతి సభకు పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది రాంచందర్ రావు వాదించారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించి అనుమతి పొందాల్సి వస్తోందన్నారు.

### షరతులతో కూడిన అనుమతి

ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు పోలీసుల తీరుపై హోంశాఖ జీపీని ప్రశ్నించింది. 17 రోజుల క్రితం సదస్సు కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఎందుకు నిర్ణయం తీసుకోలేదని జీపీని ప్రశ్నించింది. పోలీసు కేసులున్న వాళ్లు సదస్సులో పాల్గొనే అవకాశం ఉందనే విషయాన్ని దరఖాస్తుదారులకు చెప్పారా అని ప్రశ్నించింది. శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదముందని బీఆర్ఎస్ వాళ్లకు సమాచారమిచ్చారా అని అడిగింది. బీఆర్ఎస్ నేతలు అన్ని ఏర్పాట్లు చేసుకున్న తర్వాత అనుమతి నిరాకరించడం సరైంది కాదని హైకోర్టు పేర్కొంది. సభకు షరతులతో కూడిన అనుమతి ఇస్తూ పిటీషన్?పై విచారణ ముగించింది. శాంతియుతంగా సదస్సు నిర్వహించుకోవాలని రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలుండొద్దని వెల్లడించింది. విజయవాడ జాతీయ రహదారిని దిగ్బంధించొద్దని హైకోర్టు షరతులు విధించింది.

## సంపాదకీయం

# ఇస్రోలో ఏం జరుగుతోంది

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఆర్వో) ఇటీవలి నెలల్లో తన అనుభవజ్ఞులైన సైంటిస్టులను కోల్పోతోంది. ఈ పరిణామం దేశంలోని అత్యంత ముఖ్యమైన అంతరిక్ష కార్యక్రమాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనిని అడ్డుకోవడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీవోఎస్) తక్షణ చర్యలు తీసుకుంటోంది. కొన్ని నెలలుగా ఐఎస్ఆర్వో నుంచి 100 నుంచి 120 మంది సైంటిస్టులు రాజీనామా చేశారు. ఇందులో అనుభవం, నైపుణ్యం ఉన్న వారు కూడా ఉన్నారు. వంద మందికిపైగా సైంటిస్టులు ఇస్రోను వీడడం మామూలు విషయం కాదు. సంస్థలో ప్రతీ సైంటిస్టు పని అనుభవం, జ్ఞానం అనేది సంస్థకు ఒక ఆస్తి. వంద మందికిపైగా సంస్థను వీడడం మిషన్ల నాణ్యత, టైమ్‌లైన్లపై నేరుగా ప్రభావం చూపుతుంది. భారతదేశం మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)వంటి చారిత్రాత్మక మిషన్లను చేపట్టింది. ఇలాంటి ప్రాజెక్టులలో పనిచేసే సైంటిస్టులు రాజీనామా లేదా వాలంటరీ రిటైర్‌మెంట్ కోరినప్పుడు, వాటిని వెంటనే ఆమోదించవద్దని ఇస్రో కేంద్రాలకు డీవోఎస్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదులుగా, అలాంటి అభ్యర్థనలను డీవోఎస్‌కు పంపి, అక్కడి నుంచి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇది సాధారణ ఆదేశం కాదు. కీలక మిషన్లలో పనిచేసే నిపుణులను త్వరగా కోల్పోకుండా రక్షించేందుకు తీసుకున్న జాగ్రత్త చర్య. డీవోఎస్ జోక్యం చేసుకోవడం రెండు విషయాలను స్పష్టం చేస్తోంది. ఒకటి ఇస్రోలోని అనుభవజ్ఞులైన సైంటిస్టులను నిలుపుకోవడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకుంది. రెండోది సంస్థలోని మానవ వనరుల నిర్వహణను కేంద్రీకృతం చేయాలనుకుంటోంది. ప్రతి రాజీనామా అభ్యర్థనను వ్యక్తిగతంగా పరిశీలించి, సంస్థకు అవసరమైన నైపుణ్యాలను కాపాడుకోవాలన్నది ఈ ఆదేశాల ముఖ్య ఉద్దేశం. ఇది సంస్థలోని పని వాతావరణం, పరిహారం, కెరీర్ అవకాశాల వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఇస్రో వంటి సంస్థలో సైంటిస్టుల రాజీనామాలు కేవలం వ్యక్తిగత నిర్ణయాలు మాత్రమే కావు. అవి సంస్థలోని నిర్వహణ, ప్రోత్సాహకాలు, బాహ్య అవకాశాలు వంటి విస్తృత కారణాలను ప్రతిబింబిస్తాయి. అనుభవజ్ఞులైన వారు బయటకు వెళ్లడం వల్ల కొత్తగా వచ్చే వారికి ఆ జ్ఞానాన్ని బదిలీ చేయడం కష్టమవుతుంది. పని ఒత్తిడి తగ్గించడం, మెరుగైన పరిహారం, కెరీర్ వృద్ధి అవకాశాలు, ప్రైవేట్ రంగంతో పోటీపడే విధంగా విధానాలు రూపొందించడం వంటివి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇస్రో భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు మూలస్తంభం. దాని విజయం సైంటిస్టుల ప్రతిభ, అంకితభావంపై ఆధారపడి ఉంది. డీవోఎస్ ఇచ్చిన ఆదేశాలు ఈ ప్రతిభను రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యగా కనిపిస్తున్నాయి. అయితే, ఇది కేవలం ఆదేశాలతో మాత్రమే సాధ్యం కాదు. సంస్థలోని వాతావరణం, అవకాశాలను మెరుగుపరచడం ద్వారానే దీర్ఘకాలికంగా ప్రతిభావంతులను నిలుపుకోవచ్చు. ఇస్రో మెమో గురించి అడిగిన ప్రశ్నకు సింగ్ సమాధానమిస్తూ.. అది కేవలం పరిపాలనా కారణాలతోనే జరిగిందని చెప్పారు. “లేదు, అది ఎందుకంటే... మరింత పరిణతి చెందిన స్థాయిలో నిర్ణయం తీసుకునేందుకు వీలుగా పరిపాలనా కారణాల వల్ల అలా చేశాం” అని కేంద్ర మంత్రి అన్నారు. ఇస్రోలో చాలా మంది ఉద్యోగులు ఉన్నారని, కొందరు వెళ్లిపోతుంటే మరికొందరు కొత్తగా చేరుతుంటారని ఆయన అన్నారు. “చాలా మంది వెళ్లారు, చాలా మంది వచ్చారు” అని చెబుతూ ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదని ఆయన స్పష్టం చేశారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రంలో ఏమీ జరగనప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఏముందని మంత్రి ప్రశ్నించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ చెన్నైకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ అగ్నికుల్ కాస్మోస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అబ్జర్వర్‌గా చేరారు. జనవరి 2025 వరకు ఇస్రో ఛైర్మన్‌గా కొనసాగిన కాలంలోనే జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్, భారత్ తొలిసారిగా సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య- ఎల్1 వంటి పలు చారిత్రాత్మక మిషన్లు చేపట్టారు. ఇక, భారత భవిష్యత్తు అంతరిక్ష మిషన్లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిస్తూ.. గతంలో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. “దాదాపు పదేళ్ల కిందట జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి ఒక మనిషిని పంపడం సులభమే కానీ, తిరిగి సురక్షితంగా తీసుకురావడం కూడా అంతే కష్టంతో కూడుకున్న పని అని చెప్పారు.. ఆ విధంగానే క్రూ మాడ్యూల్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు సోమనాథ్ ఆ పదవిలో లేనంత మాత్రాన గగన్‌యాన్ మిషన్ ఆగిపోయిందని అర్థం కాదు. అలా జరగదు కూడా. పైగా ఇస్రోలో పనులు నిరంతరాయంగా సాగుతాయి. పదవీవిరమణ చేసినవారు, మాజీ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టులలో భాగస్వాములుగా కొనసాగుతారు. అక్కడ పని సంస్కృతి చాలా భిన్నంగా ఉంటుంది” అని జితేంద్ర సింగ్ అన్నారు. యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ , విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ వంటి ఇస్రో కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సోమవారం జారీ చేసిన అంతర్గత మెమోలో కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్రతిష్టాత్మక మానవ సహిత అంతరిక్ష యాత్ర ‘గగన్‌యాన్’, ఇతర ముఖ్యమైన మిషన్లతో ముడిపడి ఉన్న గ్రూప్ ‘ఎ’ సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామాలను లేదా స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలను సాధారణ పద్ధతిలో ఆమోదించవద్దని ఆదేశించింది.

# ప్రశ్నపై ‘ఉపా’ అస్త్రమా!



ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టాల అవసరం ఎంత ముఖ్యమో, ఆ చట్టాల వినియోగంలో వివేకం అంతకన్నా ముఖ్యం. ‘ప్రశ్న’ అనే యూట్యూబ్ నడిపే జర్నలిస్టు రావణ్ అలియాస్ బీ జోసెఫ్‌ను ఇటీవల ఏపీ పోలీసులు యూఏపీఏ (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) కింద అరెస్టు చేయడం మౌలిక ప్రశ్నను ముందుకు తెచ్చింది. అసలు ప్రశ్న ఏమిటంటే.. తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన చట్టాన్ని వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి సరైందేనా?+వశీస్త్రతీఖుజూష్త్రఱఎ =వటవతీవఅషెవ
రావణ్ వ్యాఖ్యల్లో పాలకులకు అభ్యంతరకమైనవి ఉండొచ్చు. కానీ వాటిని ఎదుర్కొనేందుకు భారతీయ న్యాయవ్యవస్థలో ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి. అలాంటప్పుడు నేరుగా యూఏపీఏ వంటి చట్టాన్ని ఆశ్రయించడం సహజంగానే ఆందోళన కలిగిస్తున్నది. చట్టాల ప్రయోగం నేర తీవ్రతకు అనుగుణంగా తులనాత్మకంగా ఉండనవసరం లేదా? అనేదే అసలు ప్రశ్న. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత కేంద్ర ప్రభుత్వం యూఏపీఏను మరింత కఠినతరం చేసింది. దేశ భద్రత కోసం అవసరమని చెప్పింది. చట్టం ఎంత కఠినమో, దాని వినియోగం అంత జాగ్రత్తగా ఉండాలి. లేనిపక్షంలో అది ఉగ్రవాదులను మాత్రమే కాదు, పాలక పక్షంతో విభేదించే స్వరాలను కూడా లక్ష్యంగా చేసుకొనే ప్రమాదం ఉంటుంది. 2014 తర్వాత యూఏపీఏ వినియోగంపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చ ప్రారంభమైంది. ఎంతోమంది విద్యార్థి నేతలు, రచయితలు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులపై కూడా ఈ చట్టాన్ని ప్రయోగించారు. కోర్టు తీర్పు ఇవ్వకముందే ఏండ్ల తరబడి స్వేచ్ఛను హరించడం న్యాయమా? చివరకు నిర్దోషిగా బయటకు వచ్చిన వారికి కోల్పోయిన జీవితకాలాన్ని ఎవరు ఇవ్వగలరు?

భారతీయ సమాజంలో జరిగిన ప్రతి ప్రధాన సంస్కరణ వెనుక ప్రశ్నించిన తర్కం ఉన్నది. ఒక ఆలోచనను సమర్థించే హక్కు ఎంత ముఖ్యమో, దానిని విమర్శించే హక్కు కూడా అంతే ముఖ్యం. ప్రజాస్వామ్యం బలం ఒక అభిప్రాయాన్ని రక్షించడంలో కాదు; పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలకు ఒకే వేదికపై చోటుకల్పించడంలో ఉన్నది. సంస్కరణల చరిత్రను పరిశీలిస్తే, సమాజాన్ని ప్రశ్నించిన మహనీయులు వ్యక్తిగత దూషణలను, కుల-మత విద్వేషాలను, అసభ్య పదజాలాన్ని ఆశ్రయించలేదనే వాస్తవం కనబడుతుంది. తమ వాదనలు, ఆలోచనలు, తర్కంతో మాత్రమే సమాజాన్ని వారు ప్రభావితం చేశారు. అందువల్ల భావ ప్రకటన స్వేచ్ఛను సమర్థించడమంటే అసభ్యతను సమర్థించడం కాదు. విమర్శను సమర్థించడం అంటే విద్వేషాన్ని ప్రోత్సహించడం కాదు. ఇప్పుడు సామాజిక మాధ్యమాలు, రాజకీయ వేదికలు, ప్రజా చర్చల్లో విభేదాలను తర్కంతో కాకుండా దూషణలతో ఎదుర్కొనే ధోరణి పెరుగుతున్నది. ఇది ప్రజాస్వామ్య సంస్కృతికి మంచిది కాదు.

ఆయన వ్యాఖ్యలు తప్పని భావిస్తే, ఆ తప్పును నిర్దిష్టంగా చూపించాలి. ఎక్కడ హద్దు దాటారో చెప్పాలి. చట్టపరంగా ప్రశ్నించాలి. కానీ ఆ ప్రక్రియలోనే చర్చను, విమర్శను, భావవ్యక్తీకరణను, ఆలోచనను, మేధో స్వేచ్ఛను భయభ్రాంతులకు గురిచేసే విధంగా యూఏపీఏ వంటి అసాధారణ చట్టాలను ప్రయోగించడం ప్రమాదకరమైన ధోరణి. ఈ రోజు రావణ్‌పై ప్రయోగించిన చట్టం రేపు మరొక జర్నలిస్టుపై, ఎల్లుండి ఒక రచయితపై, ఆ తర్వాత ఒక అధ్యాపకుడిపై లేదా ప్రతిపక్ష నాయకుడిపై ప్రయోగించబోరని ఎవరూ హామీ ఇవ్వలేరు.

ఒక దేశం బలాన్ని దాని జైళ్లు నిర్ణయించవు. భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన స్వేచ్ఛ కేవలం అనుకూల అభిప్రాయాల కోసం కాదు; అసమ్మతి వ్యక్తం చేసే హక్కు కోసం కూడా. ఎందుకంటే ప్రశ్నలు లేకుండా సంస్కరణ లేదు. విభేదం లేకుండా పరిణామం లేదు. విమర్శ లేకుండా ప్రజాస్వామ్యం లేదు. భయాన్ని చట్టం సృష్టించవచ్చు. కానీ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేది భయం కాదు, స్వేచ్ఛ. మౌనం కాదు, ప్రశ్న.

# అటు పంటతడి.. ఇటు కంటతడి



కళ్లముందే పారుతున్న గోదావరి నీళ్లను పాలకులు దిగువకు వదిలి వేస్తుంటే తెలంగాణ రైతులు అల్లాడిపోతున్నారు. దశాబ్దాలుగా సాగునీటి కొరతతో నలిగిపోయిన నేలకు ప్రతి చుక్క నీరు ఎంతో విలువైనది. కాళేశ్వరం లాంటి మల్టీ లెవెల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను వదిలేసి, అనవసరమైన ఊహలు, భయాల చుట్టూ పాలకులు కాలయాపన చేయడం వల్ల అన్నదాతలకు తీరని అన్యాయం జరుగుతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తెలంగాణ విశ్రాంత నీటిపారుదలశాఖ ఇంజినీర్లు, నిపుణులు తప్పుబడుతున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నీటిని ఎత్తిపోయాలని సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం మొండి కేయడం శోచనీయం. తెలంగాణ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గోదావరి జలాలు మొత్తం దిగువకు వెళ్తున్నాయి. ఈ నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాడుకుంటున్నది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టా స్థిరీకరణకు వినియోగిస్తున్నది. ఇంకా మిగిలిన నీటిని ధవళేశ్వరం బరాజ్ నుంచి డైవర్షన్ చేసి వాడుకుంటున్నది. వాళ్లు వాడుకోగా మిగిలిన నీరు మాత్రమే సముద్రం పాలవుతున్నది. మన గడ్డపై ప్రాజెక్టులు ఉండి, నది నిండుగా ప్రవహిస్తున్నా తెలంగాణ రైతులకు నీరు అందకపోవడం రైతుల్లో, ప్రజల్లో ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకుండానే, సహజంగా వస్తున్న నదిని వినియోగించుకొని నీటిని లిఫ్ట్ చేసే సౌకర్యం ఉన్నది.

గోదావరి, ప్రాణహిత నదుల నుంచి మేడిగడ్డ వద్దకు కనీసం 50,000 క్యూసెక్కుల ప్రవాహం వచ్చినప్పుడు, నదిలో నీటి మట్టం సహజంగానే o90 నుంచి o91 మీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. బరాజ్ గేట్లన్నీ తెరిచి ఉంచినా కూడా, ఈ మట్టం వద్ద నీరు కన్నెపల్లి పంప్ హౌస్ అప్రోచ్ చానెల్‌లోకి సులభంగా ప్రవహిస్తుంది. కాబట్టి మేడిగడ్డ బరాజ్‌పై ఒత్తిడి లేకుండానే పంప్ చేసుకోవచ్చు. కన్నెపల్లి పంప్ హౌస్ నడిపితే వచ్చే వైబ్రేషన్ల వల్ల మేడిగడ్డ బరాజ్ కూలిపోతుందన్న కాంగ్రెస్ నేతల వాదనను విశ్రాంత ఇంజినీర్లు పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. కేవలం తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలుకుతున్నారు. సమైక్య రాష్ట్రంలో దశాబ్దాలుగా తెలంగాణ రైతులు అనుభవించిన వేదనకు ముగింపు పలకడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కారణాలతో కాంగ్రెస్ సర్కార్ పడావు పెట్టడం సరికాదు. వందలాది టీఎంసీల గోదావరి వరద జలాలు కండ్ల ముందే తరలిపోతుంటే, రైతులు ఆకాశం వైపు దీనంగా చూస్తూ కన్నీరు మున్నీరవుతున్నారు. పాలకులు ఊహాజనిత, కుట్ర పూరిత వైఖరితో వ్యవహరించడం తెలంగాణ రైతులకు ద్రోహం చేయడమే అవుతుంది.

ఎల్ నినో లాంటి భయంకరమైన వాతావరణ పరిస్థితిలో కూడా కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించకపోతే తెలంగాణ ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేసినట్టే. మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిపోవడాన్ని సాకుగా చూపి ఎగువన ఉన్న అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బరాజ్‌లను కూడా నిరుపయోగంగా వదిలేయడం ఎంతవరకు సమంజసం? ఈ రెండు బరాజ్‌లకు అవసరమైన చిన్నపాటి మరమ్మతులు పూర్తయి, ప్రస్తుతం అవి 100 శాతం నీటిని నిల్వ చేయడానికి, తరలించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండు బరాజ్‌లను నింపడం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రధాన జలాశయాలను నింపే అద్భుతమైన అవకాశం ఉన్నది. కానీ, ప్రాథమిక ఇన్‌టేక్ వ్యవస్థను తాకడానికి కూడా ప్రభుత్వం నిరాకరిస్తున్నది. మోటార్లు నడిపిస్తే వాటి కంపనాలతో బరాజ్ కుంగిపోతుందని అవాస్తవాన్ని అపోహను ప్రచారం చేస్తున్నది. ఇది పూర్తిగా అబద్ధం, హాస్యాస్పదం. కన్నెపల్లి పంప్ హౌస్ నడిపిస్తే వచ్చే కంపనాల వల్ల మేడిగడ్డ బరాజ్ మరింత కూలిపోతుందనే అధికారుల వాదనను నిపుణులు పూర్తిగా కొట్టిపారేస్తున్నారు. భౌగోళికంగా కన్నెపల్లి పంప్ హౌస్ మేడిగడ్డ బరాజ్‌కు దాదాపు 1-2 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. పైగా ఈ రెండింటి పునాదులు ఒకదానికొకటి సంబంధం లేని ‘ఐసోలేటెడ్ ఫౌండేషన్స్’. ఇంత దూరం ఉన్నా పంపుల వల్ల బరాజ్ కూలిపోతుందనడం సాంకేతికంగా అబద్ధం. ఇది కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి చెప్తున్న సాకులు. రాజకీయ లెక్కలు, బ్యూరోక్రాటిక్ సమస్యలు, పట్టింపులను పక్కనబెట్టి, ఇంజినీరింగ్ ప్రతిభకు పదును పెట్టాల్సిన సమయం ఇది. పనిచేసే స్థితిలో ఉన్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఎలాంటి ముప్పు రాకుండానే, ’రన్-ఆఫ్-ది-రివర్’ పద్ధతిలో నీటిని మళ్లించడం ప్రస్తుత సంక్షోభానికి తక్షణ మార్గం. ఉరకలేస్తున్న గోదావరిని తెలంగాణ జలాశయాలకు మళ్లించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి. లేదంటే, నది పారినా తాగునీరు, సాగునీరు లేక తెలంగాణ కరువు కాటకాల్లో మునిగిపోతుంది. ఆ పాపం కాంగ్రెస్ పాలకులదే అవుతుంది. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

# అమెరికా అమిత్ర వైఖరి

ఒకసారంటూ పొరపొచ్చాలు వచ్చాక ఎంత సన్నిహిత మిత్రుల మధ్యనైనా తిరిగి సాధారణ సంబంధాలు ఏర్పడటం అంత సులభం కాదు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ--7 దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య బుధవారం జరిగిన ద్వైపాక్షిక సమావేశం తీరుతెన్నులు గమనిస్తే ఈ సంగతి సులభంగా అర్థమవుతుంది. ట్రంప్ గత 16 నెలలుగా అనుసరిస్తున్న అమిత్ర వైఖరి ఇందుకు కారణం. మిత్ర దేశాలని లేదు, ప్రత్యర్థి దేశాలని లేదు -- అందరినీ ఒకే గాటన కడుతూ, ఒక దేశాధినేతకు ఉండాల్సిన కనీస ఔచిత్యాన్ని మరిచి ఇష్టానుసారం మాట్లా డటం ఆయనకు అలవాటుగా మారింది. అంతేకాదు -- ఎడాపెడా అధిక సుంకాలు విధించటం, తమ సరుకుపై సుంకాలు తగ్గించాలని కోరడం వంటివి మన దేశాన్ని చీకాకు పరి చాయి. ఇలాంట చేదు అనుభవాలు ఎన్ని ఎదురైనా మన దేశం సంయమనం పాటించింది. నిజానికి మొన్న భారత నావికులు ముగ్గుర్ని హోర్ముజ్ జలసంధి వద్ద హత్య చేసిన ఉదంతంతోసహా ఈ 16 నెలల పొడవునా మన దేశం పరుషంగా మాట్లాడింది ఎప్పుడూ లేదు. నోబెల్ శాంతి బహుమతి యావలో భారత్--పాక్ యుద్ధాన్ని తానే ఆపాననీ, ఇద్ద రినీ తీవ్రంగా బెదిరించాననీ మాట్లాడినప్పుడు అందులో ఏమాత్రం నిజం లేదని మన దేశం చెప్పింది. ఆయన ఇలా డప్పుకొట్టుకుంటున్నప్పుడల్లా మొదట్లో ఖండిస్తూనేవచ్చింది. కానీ దీన్ని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారని తేలాక మిన్నకుండి పోయింది. అయినా ట్రంప్‌లో ఆగ్రహావేశాలు తగ్గలేదని తాజా సమావేశం రుజువు చేసింది. మాటలకేం... ట్రంప్ చాలా మాట్లాడారు. 55 నిమిషాలపాటు సాగిన ఈ సమావేశం అనంతరం ‘మోదీ మంచిగా కనబడతారు. బాగుంటారు. దేవదూత. కానీ ‘కిల్లర్’. వాణిజ్య, వ్యాపార చర్చల్లో చాలా కఠినంగా, నిక్కచ్చిగా ఉంటారు’ అంటూ ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం ఎవరైనా భారత్‌వైపు కన్నెత్తి చూస్తే వాళ్ల అంతు చూస్తామని కూడా చెప్పారు. వాణిజ్య ఒప్పందం విషయంలో చాలా దగ్గరగా వచ్చేశామని కూడా అన్నారు. కానీ చేతలు చూస్తే అందుకు అనుగుణంగా లేవు. తన ఆధ్వర్యంలోని కమాండ్లలో ఒకటైన ఇండో--పసిఫిక్ కమాండ్‌కు ఆ పేరు పెట్టింది ఆయన ఏలుబడిలోని అమెరికాయే. తిరిగి ఆయనే ఎనిమిదేళ్లనాటి ఆ పేరులో భారత్‌నుసూచించే ‘ఇండో’ తొలగించి ఇప్పుడు యూఎస్--పసిఫిక్ కమాండ్‌గా మార్చటం, అది కూడా ఈ సమావేశానికి కొంచెం ముందుగా చేయటం యాదృచ్ఛికమేమీ కాదు. ఇటీవల యూఎస్--పసిఫిక్ కమాండ్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)ను పాకిస్తాన్‌లో అంతర్భాగంగా చూపటంలోనూ అమెరికా దురుద్దేశం స్పష్టమే.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
18 జూలై 2026

# డీలిమిటేషన్ బిల్లు గులాబీలో అయోమయం




**హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ ఉంటుంది భారత రాష్ట్ర సమితి. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భారతీయ జనతా పార్టీ అధినాయకత్వం మీద ఇష్టానుసారంగా మాట్లాడేవారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని.. హోం శాఖ మంత్రి అమిత్ షా ను తీవ్రస్థాయిలో విమర్శించేవారు. ఒక దశలో తన సొంత పత్రికలో ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయించేవారు. అయితే ఇప్పుడు సీన్ మారినట్టు కనిపిస్తోంది. భారతీయ జనతా పార్టీ విషయంలో భారత రాష్ట్ర సమితి వైఖరి మారిపోయినట్టు కనిపిస్తోంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన పార్లమెంటు నియోజకవర్గం ప్రక్రియపై రాజకీయ పార్టీలు వాటి లక్ష్యాలకు అనుగుణంగా స్పందిస్తున్నాయి. అయితే ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి ఒకరకంగా ట్విస్ట్ ఇచ్చింది. కెసిఆర్ సూచనల మేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అత్యంత వ్యూహాత్మకంగా ఒక ప్రకటన చేశారు. డీ లిమిటేషన్ బిల్ మీద ఇప్పటివరకు కెసిఆర్ ప్రతికూలమైన స్వరాన్ని వినిపించారు. ఇప్పుడు ఒకసారిగా గొంతు సవరించుకున్నారు. తన కుమారుడు కేటీఆర్ ద్వారా డీలిమిటేషన్ బిల్లుకు పార్టీ తరపునుంచి జై కొడుతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా తగ్గకుండా ఉండాలని.. అప్పుడే సపోర్ట్ చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్లో 24% వాటా ఉంది. దీనిని వచ్చే రోజుల్లో కూడా అదే విధంగా కొనసాగించాలి. ఇది డిమాండ్ ను కేటీఆర్ మళ్లీ తెరపైకి తీసుకొచ్చారు.జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు ఉంటే దక్షిణాది రాష్ట్రాలకు విపరీతంగా అన్యాయం జరుగుతుందని గతంలో కేసీఆర్ అనేవారు. ఇప్పుడు అదే మాటను కేటీఆర్ కూడా అంటున్నారు. అంతేకాదు దక్షిణాది రాష్ట్రాలు పకడ్బందీగా అభివృద్ధి చెందుతున్నాయని.. అటువంటి రాష్ట్రాల మీద కేంద్రం డి లిమిటేషన్ పేరుతో కత్తి దూయకూడదని కేటీఆర్ చెబుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలిగితే తాము తీవ్రంగా స్పందిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.పార్లమెంట్లో ప్రస్తుతం 543 స్థానాలు ఉన్నాయి. ఈ ప్రకారం సౌత్ స్టేట్స్ మొత్తం కలిపి 24 శాతం బాట కలిగి ఉన్నాయి. వచ్చే రోజుల్లో సీట్ల సంఖ్య యావ శాతం ఫార్ములా ప్రకారం పెరిగిపోతే.. అప్పుడు దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గదు. కేటీఆర్ అంటున్నట్టుగానే 24 శాతం వాటా ఉంటుంది. అలాంటప్పుడు కేటీఆర్ హెచ్చరించడంలో అర్థం ఏముంది. దక్షిణ ప్రాంతానికి చెందిన ప్రజల ప్రయోజనాలను కాపాడే ఫార్ములాను బిల్లులో చేర్చాలని కేటీఆర్ అంటున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే డిలిమిటేషన్ బిల్లు కు గులాబీ పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేదు . మరి ఇన్ని రోజులపాటు డీ లిమిటేషన్ బిల్లు మీద వ్యతిరేక వార్తలు రాసిన భారత రాష్ట్ర సమితి కరపత్రిక నమస్తే తెలంగాణ పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకుంటే. . అత్యంత బాధగా ఉంటుంది. పాపం..

**కేటీఆర్ కు తత్వం తెలిసొచ్చిందా**

రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయంపై ఆయన మొదటిసారి అత్యంత పారదర్శకంగా.. ఆత్మపరిశీలనాత్మకంగా స్పందించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఎంపీ వద్దిరాజు నివాసంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఓటమికి గల కారణాలను ముక్కుసూటిగా అంగీకరించారు. "మా కళ్లు నెత్తికెక్కాయి కాబట్టే మూడోసారి అధికారంలోకి రాలేకపోయాం. ఈ ఓటమిలో 100 శాతం మా తప్పులే ఉన్నాయి. ప్రజల తీర్పును గౌరవిస్తూనే.. మా లోపాలను తప్పకుండా సరిదిద్దుకుంటాం" అని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ 1.8 శాతం ఓట్ల వ్యత్యాసం గత ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజలు బలంగా నమ్మారని కేటీఆర్ పేర్కొన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో ఇతరులకు కూడా ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లు భావించారని ఆయన అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ కేవలం 1.8% ఓట్ల తేడాతో అంటే దాదాపు నాలుగు లక్షల ఓట్ల వ్యత్యాసంతోనే అధికారాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు. అయితే 2018 ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి బీఆర్ఎస్ ఓటు బ్యాంకు దాదాపు 10% తగ్గడం వాస్తవమేనని ఆయన అంగీకరించారు. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శల బాణాలు రాబోయే రోజుల్లో తెలంగాణలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాధికారం కోసం తహతహలాడుతున్న బీజేపీకి ఇక్కడ కనీసం సీఎం అభ్యర్థే లేరని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తరహా ఫలితాలే పునరావృతమవుతాయని.. బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవీకాలం చివరి ఆరు నెలల్లో ఏదో మ్యాజిక్ చేసి మళ్లీ అధికారంలోకి వస్తామని పగటికలలు కంటున్నారు. కానీ, ప్రజలు కాంగ్రెస్ మార్కు మోసపూరిత ప్రయత్నాలను అస్సలు నమ్మరు." అని కేటీఆర్ అన్నారు. మెట్రో విస్తరణ, డీలిమిటేషన్ అంశాలపై స్పష్టత హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే రాయదుర్గం నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో పనుల టెండర్లు పూర్తి చేసి, ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించామని తెలిపారు. 24 నెలల్లో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు టెండర్లను కాంగ్రెస్ రాగానే రద్దు చేసిందని, ఇప్పుడు 28 నెలల తర్వాత మళ్లీ కొత్తగా ప్రకటిస్తూ డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. పార్టీనే సుప్రీం గతకొద్ది రోజులుగా 'టీఆర్ఎస్' పేరుతో కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ అవుతుందనే ప్రచారంపై కేటీఆర్ స్పందించారు. ఎవరైనా ఆ పేరును తిరిగి వాడాలని చూస్తే బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఖచ్చితంగా అభ్యంతరం వ్యక్తం చేస్తారని, ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసి ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా "తాను అయినా, మరెవరైనా సరే.. పార్టీ కంటే పెద్దవాళ్లు కాదు. పార్టీనే సుప్రీం" అని కేటీఆర్ కేడర్‌కు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. మొత్తానికి కేటీఆర్ చేసిన ఈ ఆత్మపరిశీలన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త చర్చకు దారితీశాయి. తప్పులను ఒప్పుకుంటూనే భవిష్యత్తులో కాంగ్రెస్‌పై పోరాటానికి పార్టీని సమాయత్తం చేసే వ్యూహంతో కేటీఆర్ ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# రిజర్వుడ్ స్థానాలపై కమలం గురి



**హైదరాబాద్ :** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో ఎలాగైనా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని బీజేపీ సరికొత్త రాజకీయ వ్యూహానికి తెరలేపింది. ఎస్సీ మోర్చా సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకోవాలంటే ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో గెలుపే అత్యంత కీలకమని, ఆ స్థానాలను టార్గెట్ చేస్తూనే పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో దళిత ఓటర్లు అత్యంత నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న స్థానాల ప్రకారం చూస్తే, మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో 19 స్థానాలు షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేయబడ్డాయి. అలాగే మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 3 స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ అయి ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఇవి డబుల్ అయ్యే అవకాశం ఉంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రిజర్వుడ్ స్థానాల్లో కాంగ్రెస్ ఏకపక్షంగా 14 స్థానాలను గెలుచుకోగా? బీజేపీ మాత్రం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. అందుకే, ఈసారి ఆ పొరపాట్లను సరిదిద్దుకుని, క్షేత్రస్థాయి నుంచి పక్కా ప్లాన్‌తో వెళ్లాలని కమలదళం భావిస్తోంది.ఎస్సీ స్థానాలపై బీజేపీ కన్నేయడానికి అనేక కారణాలున్నాయి. రాష్ట్రంలో దాదాపు ప్రతీ నియోజకవర్గంలోనూ దళిత ఓటర్లు గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్నారు. ఈ వర్గాన్ని తమ వైపు తిప్పుకోకుండా తెలంగాణలో అధికారం సాధించడం అసాధ్యమని బీజేపీ అగ్రనాయకత్వం గుర్తించింది. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది, రిజర్వేషన్లను రద్దు చేస్తుంది.. అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టడం బీజేపీ ప్రధాన ఉద్దేశం. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారానే అక్కడ దళితులకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు లభించాయని, రిజర్వేషన్లను కాపాడిన హిస్టరీ కేవలం బీజేపీదేనని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది.ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వల్ల పేద దళిత బస్తీల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి సరైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారనే భావనను కలిగించడం ద్వారా కాంగ్రెస్ మైలేజ్‌ను తగ్గించవచ్చనేది కమలనాథుల వ్యూహం.రాబోయే రోజుల్లో ఎస్సీ నియోజకవర్గాల్లో జెండా ఎగరేయడానికి బీజేపీ ఒక పక్కా రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బూత్ స్థాయి నుంచి ఎస్సీ మోర్చా కార్యకర్తలను యాక్టివ్ చేయడం, ప్రతీ దళిత వాడలోనూ స్థానిక సమస్యలపై పోరాటాలు చేయడం ఇందులో భాగం. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత సంక్షేమ పథకాలు (ముద్రా లోన్లు, స్టాండప్ ఇండియా, పీఎం ఆవాస్ యోజన వంటివి) లబ్ధిదారుల ఇళ్లకు చేరేలా డోర్-టు-డోర్ క్యాంపెయిన్ నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. దేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ వంటి దళిత, గిరిజన వర్గాలకు అత్యున్నత పదవులు కల్పించిన ఘనత బీజేపీదేనని చాటిచెప్పడం ద్వారా దళితులలో నమ్మకాన్ని పెంచాలని భావిస్తోంది.మొత్తానికి, గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి ఎస్సీ స్థానాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన బీజేపీ.. తెలంగాణలో తన పొలిటికల్ మైలేజ్‌ను పెంచుకోవడానికి గట్టిగానే ప్లాన్ చేస్తోంది. రాబోయే రోజుల్లో ఈ వ్యూహాలు ఎంతవరకు వర్కవుట్ అవుతాయో చూడాలి

## రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ :** తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మొదట పరిశీలించారు. తర్వాత చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కొత్తపల్లి , ఉల్లంపల్లి గ్రామాల్లో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం 7 గ్రామాల్లో ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల తహసీల్దారులు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల స్కీము ఎత్తి వేయాలనే కుట్రలు మానుకోవాలి

**ఉనీ.ఔనీ.9 రద్దు చేసి – పాత పద్ధతిలో ఈ స్కీమును అమలు చేయాలి**

**ఫీజుల బకాయిలు 8వేల కోట్లు చెల్లించాలని హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడి**

**హైద్రాబాద్ :** రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు 8 వెలకోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమునుయధాతధంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేటుముట్టడించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్, నీల వెంకటేష్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా విద్యార్థ అర్థ నగ్న ప్రదర్శన నిర్వహిస్తూ మాకు న్యాయం చేయండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారు. ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసి కుట్ర చేస్తున్నారు అంటే 23 వేల ప్రభుత్వ పాఠశాలను రద్దు చేస్తామని బహిరంగంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే ఎంతో ఉన్నత విద్య ప్రమాణాలతో బలహీన వర్గాల జీవితాల మార్పు, అభివృద్ధి చేస్తున్న గురుకులాలను కులాల పేరు మీద వద్దు అంటూ పెద్ద సంస్కర్త లాగా పలుకుతూ రద్దు చేసే కుట్రకు తెర తీస్తున్నారని విమర్శించారు.ఈ ముట్టడి కార్యక్రమంలో చేరుకుల రాజెందర్ ,నిఖిల్ ఎటిట్, అనంతయ్య, , కిరణ్ కుమార్, మోహన్ వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్ 2026 ఫలితాలలో అగ్రస్థానంలో శ్రీ చైతన్య విద్యార్థులు

నీట్ 2026 ఫలితాలలో ఆల్ ఇండియాలోనే శ్రీ చైతన్య విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ,సీమ బొప్పన తెలియజేశారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకు, ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో తెలుగు రాష్ట్రాలు సాధించిన టాప్ 10లో ఎనిమిది ర్యాంకులు చైతన్య విద్యార్థులు సాధించినవేనని తెలిపారు.రోజు రోజుకు విద్య విధానంలో వస్తున్న పెను మార్పులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ గత ఏడాది కంటే 15% ఉత్తీర్ణత ఎక్కువ సాధించడం చైతన్య విద్యాసంస్థలకే సాధ్యమైందని అన్నారు.తమ దగ్గర ఉన్న అత్యుత్తమ ఫ్యాకల్టీల నిరంతర శ్రమ,ఇన్ఫినిటీ లెర్న్ టెక్నాలజీ సహాయంతో అందించిన అత్యుత్తమ శిక్షణ వల్ల లాంగ్ టర్మ్ విద్యార్థులు కూడా అత్యధికంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు.రాబోవు 2027 అకాడమిక్ సంవత్సరం నుండి మారుతున్న పరీక్ష సరళికి అనుగుణంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(అఐ), ంఎ విధానాలతో సరికొత్త శిక్షణ అందించనున్నామని తెలిపారు. ఎందుకు సంబంధించి డిజిటల్ పరంగా సిద్ధం చేసేందుకు ఏసర్, ఇంటెల్ సంస్థలతో కలిసి శ్రీ చైతన్య అనుబంధ ఇన్ఫినిటీ లెర్న్ ఒప్పందం కుదుర్చుకుంది అని తెలిపారు. విద్యార్థుల కొరకు సరికొత్తగా నీట్ రెడీ ల్యాప్ టాప్ ను దేశంలోనే ప్రథమంగా తమ రూపొందించమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని వారు సన్మానించారు.

## మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని కుల్సుంపురలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో స్థానికులు దాడి చేయడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళితే.. కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని డబుల్ బెడ్రూం సముదాయంలో నివాసముండే అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి, నిలోఫర్ ఆసుపత్రి వద్ద టీ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతంలో నివసించే 9 ఏళ్ల బాలిక పట్ల ఇటీవల అతను అనుచితంగా ప్రవర్తించాడు. బాలికకు ముద్దులు పెట్టి, ఆమె ప్రైవేట్ భాగాలను తాకినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో అది చూసిన బాలిక కుటుంబసభ్యులు, స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆవేశంతో అజీజ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిన్న రాత్రి అజీజ్ మృతిచెందాడు.ఈ ఘటనపై కుల్సుంపుర పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడికి పాల్పడిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
18 జూలై 2026

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగపు రాష్ట్ర అదనపు కార్యదర్శిగా రాంబాబు

స్నేహాలయ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మైలారపు రాంబాబుకు ఘన సన్మానం

**నవగీతం, మెట్ పల్లి:** రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగపు రాష్ట్ర అదనపు కార్యదర్శిగా నియమితులైన మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు ను మెట్‌పల్లి స్నేహలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు రాంబాబుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఆయనకు లభించిన ఈ బాధ్యత పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. రాంబాబు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ, సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కోట కిరణ్ కుమార్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి నవీన్ కుమార్ చైతన్య నగర్ వాడకట్టు సంఘం అధ్యక్షులు బండారి గోపికృష్ణ బండారి ప్రసాద్ పడిగల పవన్ కోట వాసు బండారి మారుతి తాటికొండ శ్రీధర్ ఎలగందుల వేణుగోపాల్ ఆర్య వైశ్య సంఘం కార్యదర్శి ఎల్మి రవి దొంతుల చక్రపాణి సి హెచ్ మారుతి రాజు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డాక్టర్ రఘు



**నవగీతం,మెట్ పల్లి : ఈ నెల జులై 19** న మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలో జరగనున్న హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఏర్పాట్లను నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, పార్కింగ్, భద్రత, పరిశుభ్రతతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. జూలై 19న నిర్వహించే హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ రఘు కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు సమృద్ధి కురవాలని గ్రామ దేవతకు పూజలు



**నవగీతం, రాయికల్ ప్రతినిధి:** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శుక్రవారం రోజున గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామ దేవత శ్రీ మహాలక్ష్మి పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు మరియు అన్ని కుల సంఘ పెద్ద మనుషులు డప్పు చప్పుళ్ల తో, మహిళల మంగళ హారతులతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు.. అనంతరం మహిళలంతా అమ్మవారికి ఓడి బియ్యం, పసుపు, కుంకుమ, కుడుకలు గాజులు, పూలు సమర్పించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, గ్రామ సేవా సమితి ఉపాధ్యక్షులు ఓరగంటి శేఖర్, కోశాధికారి నాగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సామల లావణ్య వేణు, వార్డు సభ్యులు నరేష్, ధనంజయ్, దాయతి సుదర్శన్, విష్ణు బృందం, ఆలయ నిర్వాహకులు చందనగిరి నరేందర్, రమేష్, నవీన్, శ్రీను, గ్రామ సేవా సమితి కార్యవర్గ సభ్యులు, యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి ఆవాసంలో ఉచిత ఆరోగ్య శిబిరం





**నవగీతం జగిత్యాల:** సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగిత్యాల ధరూర్ క్యాంపు లోని వాల్మీకి ఆవాసంలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండేటి అర్జున్, చర్మవ్యాధుల నిపుణులు డా. ఎనగందుల నరేష్ ఆవాసం పూర్వ విద్యార్థి డా. నరేంద్ర (అనస్తీసియా ) దంత వైద్య నిపుణులు డా. బాశెట్టి హర్షవర్ధన్ ఆర్.ఎం.పి, పిఎంపీల సంఘం బాధ్యులు డాక్టర్ ధనుంజయ, డాక్టర్ గోపాల చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో విద్యార్థుల ఎత్తు బరువు కొలిచి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, మంచి ఆహార అలవాట్లు, ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలా జాగ్రత్త పడాలో విద్యార్థులకు వివరించారు. ఆవాస విద్యార్థుల కోసం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేసిన వైద్యులకు ఆవాస నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాస కార్యదర్శి మదన్ మోహన్ రావు, సభ్యులు డాక్టర్ ధనుంజయ, అశోక్ రావు, వెంకటేశ్వరరావు ఆవాస ప్రముఖ మల్లేశం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ బీఎల్ఏలు కృషి చేయాలి.

జగిత్యాల డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య





**నవగీతం, జగిత్యాల** రాజ్యాంగం కల్పించిన విలువైన ఓటు హక్కును అర్హులైన ప్రతి పౌరుడు పొందాల్సిన అవసరం ఉందని, ఓటు హక్కు పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య అన్నారు. శుక్రవారం జగిత్యాల మండలంలోని పోలాస గ్రామములో పర్యటించిన ఆయన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, పార్టీ నాయకులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. ఓటు హక్కుకు అర్హులైన వారు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందుబాటులో ఉండాలని,రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ




**నవగీతం, జగిత్యాల:** నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్ తో ప్రజల మద్దతు కూడగట్టాలని, టీ ఎస్ సీ పీ ఎస్ ఈ యు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనజాగరణ బస్సు యాత్రకు మద్దతుగా స్థానిక ఓల్డ్ హైస్కూల్ జగిత్యాల్లో గోడ పత్రికను పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆవిష్కరించారు. టీ ఎస్ సి పి ఎస్ ఈ యు రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ చేపట్టిన బస్సు యాత్ర తెలంగాణలోని అన్ని జిల్లాల గుండా జరుగుతుందని, మన జగిత్యాల జిల్లాలో ఈనెల 25, 26 తేదీలలో జన జాగరణ బస్సు యాత్రకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయ ఉద్యోగులు హాజరై మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సిపిఎస్ ఈ యు నాయకులు గంగాధరి మహేష్, మహేష్ గౌడ్, భోగ శ్రీనివాస్, పి ఆర్ టి యు టి ఎస్ నాయకులు ఏవియన్ రాజు, వెంకటేశం, చంద్ర ప్రకాష్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వసంత, శ్రీదేవి, విద్యాదేవి, పద్మ, అనుజ, మాధవి, రమాదేవి, విజయ, అనిల్ రావ్, శ్రీధర్, వెంకటేశ్వరరావు, పరమేశ్వర్, సునీల్, రాజ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు

## దోస్త్ స్పెషల్ ఫేజ్ ద్వారా డిగ్రీ కోర్సులు దరఖాస్తు చేసుకోండి

**నవగీతం,మెట్ పల్లి:** "దోస్త్" స్పెషల్ ఫేజ్ లో భాగంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీ ఏ, బీ కాం. ప్రథమ సంవత్సరం కోర్సుల్లో చేరటానికి ఈ నెల 20 నుంచి 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు "దోస్త్"ద్వారా డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు 400 రూపాయల రిజిస్ట్రేషన్ చార్జి చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటి వరకు వివిధ కళాశాలల్లో సి.సి ఓ.టి.పి ద్వారా చేరిన విద్యార్థులకు మాత్రం ఈ "దోస్త్-స్పెషల్ దశ"లో అవకాశం లేదని ఆయన గుర్తు చేశారు. "ఇంటర్" ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని, ఈ అవకాశాన్ని విద్యార్థులు అధిక సంఖ్యలో సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకయ్య పిలుపునిచ్చారు.

## నీట్ 2026 ఫలితాలలో అగ్రస్థానంలో శ్రీ చైతన్య విద్యార్థులు

నీట్ 2026 ఫలితాలలో ఆల్ ఇండియాలోనే శ్రీ చైతన్య విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ,సీమ బొప్పన తెలియజేశారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకు, ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో తెలుగు రాష్ట్రాలు సాధించిన టాప్ 10లో ఎనిమిది ర్యాంకులు చైతన్య విద్యార్థులు సాధించినవేనని తెలిపారు. రోజు రోజుకు విద్య విధానంలో వస్తున్న పెను మార్పులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ గత ఏడాది కంటే 15% ఉత్తీర్ణత ఎక్కువ సాధించడం చైతన్య విద్యాసంస్థలకే సాధ్యమైందని అన్నారు. తమ దగ్గర ఉన్న అత్యుత్తమ ఫ్యాకల్టీల నిరంతర శ్రమ, ఇన్ఫినిటీ లెర్న్ టెక్నాలజీ సహాయంతో అందించిన అత్యుత్తమ శిక్షణ వల్ల లాంగ్ టర్మ్ విద్యార్థులు కూడా అత్యధికంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. రాబోవు 2027 అకాడమిక్ సంవత్సరం నుండి మారుతున్న పరీక్ష సరళికి అనుగుణంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(అబ), ఒఎ

## భర్తను హత్య చేసిన భార్యకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమాన

హత్య కేసులో నిందితురాలును దోషిగా తేల్చిన జగిత్యాల జిల్లా కోర్టు



**నవగీతం,జగిత్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన భర్త హత్య కేసులో నిందితురాలికి జగిత్యాల ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కేసు వివరాలు: 2022 నవంబర్ 11వ తేదీ రాత్రి కొడిమ్యాల గ్రామంలో బత్తుల శ్రీను తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో, అతని భార్య బత్తుల ప్రమీలకు ఉన్న అక్రమ సంబంధం నేపథ్యంలో వివాదశీ జరిగింది అనంతరం శ్రీనును హత్య చేసి, సంఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని చీరతో ఉరివేసుకున్నట్లు కనిపించేలా ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొడిమ్యాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయగా ఈ కేసును మొదట బి. కోటేశ్వర్, అప్పటి సీఐ దర్యాప్తు చేయగా, అనంతరం డి. రమణమూర్తి, సీఐ దర్యాప్తును పూర్తి చేసి కోర్టు కి ఆధారాలు సమర్పించగా పిపి రామకృష్ణారావు కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన జగిత్యాల ప్రధాన జిల్లా మరియు సెషన్స్ జడ్జి శ్రీమతి రత్న పద్మావతి శుక్రవారం (17-07-2026) తీర్పు వెలువరిస్తూ, నిందితురాలు బత్తుల ప్రమీల (25) ను దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించింది. ఈ కేసు లో నిందితురాలుకి శిక్ష పడటం లో కృషి చేసిన పీపీ రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ లు కోటేశ్వర్, రమణమూర్తి,సి యం ఎస్ ఎస్.ఐ శ్రీకాంత్ , కోర్ట్ కానిస్టేబుల్ హరీష్ సి ఎం ఎస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన నిశాంత్ రెడ్డి



**నవగీతం, జగిత్యాల /గొల్లపల్లి** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గజ్జెల దుబ్బయ్య,కల్లేపల్లి గౌతమి ఇటీవల మరణించగా వారి కుటుంబాలనుకాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.10,000/-ఆర్థిక సాయం అందజేశారు. వారి పిల్లలకి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట సర్పంచులు బుర్ర సుధారాణి-భూమయ్య కొలగాని జలంధర్ మాజీ సర్పంచ్ చిర్ర గంగాధర్ నాయకులు మరంపల్లి అర్జున్ గంగన్న గంగరాజం తదితరులు ఉన్నారు.

## లక్ష్మీపూర్‌లో ఘనంగా మహాలక్ష్మి బోనాలు



**నవగీతం,జగిత్యాల:** జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామంలో శుక్రవారం మహాలక్ష్మి బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్‌లో మృతి చెందిన జలపతి కుటుంబాన్ని పరామర్శించిన జీవన్ రెడ్డి



**నవగీతం,జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు జలపతి విదేశాల్లో మృతిచెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారంనాడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. తమ ప్రాంతం నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉందని పేర్కొన్నారు. తాను పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రితో చర్చించి, విదేశాల్లో మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయించినట్లు తెలిపారు. అయితే, గత ఏడాది కాలంగా గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన సుమారు 200 మంది కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందలేదని, చెక్కులు మంజూరైన వారికి కూడా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాల కొరత కారణంగా యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, ఉపాధి కోసం వెళ్లి గల్ఫ్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని బాధిత కుటుంబాలకు విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లచ్చన్న, రాజు, జలేందర్, రాంచంద్రం, మోహన్, బషీర్, శ్రీపాల్, సురేందర్, రాకేశ్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
18 జూలై 2026

# సమృద్ధిగా వర్షాలు కురవాలని కనికెల అమ్మవారికి ప్రత్యేక పూజలు

### వరుణదేవుడిని ప్రార్థించిన కొడిమ్యాల రెడ్డి సంఘం రైతులు



**నవగీతం,కొడిమ్యాల:**. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామంలోని బొల్లం చెరువు శివారులో ఉన్న పురాతన కనికెల అమ్మవారి ఆలయంలో ఆనవాయితీగా ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని ఆకాంక్షిస్తూ కొడిమ్యాల రెడ్డి సంఘం రైతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.సంప్రదాయం ప్రకారం ఆలయం వద్ద ఉన్న దేవుడి రాయిపై పాశం పోసి, పాయసాన్ని నైవేద్యంగా సమర్పించగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పాయస ప్రసాదాన్ని స్వీకరించారు. మహిళలు, రైతులు ట్రాక్టర్లలో ఆలయానికి చేరుకుని కనికెల అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.మహిళలు వరుణదేవుడిని వేడుకుంటూ పాటలు పాడి, బతుకమ్మ ఆడి వర్షాలు కురవాలని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ జరుగగా మండలంలోని అన్ని వర్గాల వారు పాల్గొన్నారు.ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగి, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని రైతులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు నాయకులు.మహిళలు,రైతులు,యువకులు,గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కనికెల అమ్మవారిని, వరుణదేవుడిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఆలయ పరిసరాలు భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.

# నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘుకు ఘన సన్మానం






**నవగీతం, మెట్ పల్లి:** నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘును నవగీతం దినపత్రిక ఎడిటర్ పెంబి మహేందర్, ఎన్నారై జక్కుల రాజేంద్రప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘుకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి వారి సామాజిక సేవలను అభినందించారు.నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ రఘు సేవలు ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా పెంబి మహేందర్, జక్కుల రాజేంద్రప్రసాద్ కొనియాడారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.డాక్టర్ రఘు మాట్లాడుతూ, తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

## అటవీ అధికారులపై దాడి కేసు..

## మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సహా 8 మందికి జైలు శిక్ష

**అదిలాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సార్సాలలో అటవీ శాఖ అధికారులపై జరిగిన దాడి కేసులో అటవీ అధికారుల పోరాటం ఫలించింది. విధి నిర్వహణలో ఉన్న అటవీ సిబ్బందిపై కర్రలతో దాడి చేసి, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసులో ఎట్టకేలకు ఆదిలాబాద్ కోర్టులో తుది తీర్పు వెలువడింది. ఆనాటి ఈఖీ౦ా చోళే అనితపై కొందరు వ్యక్తులు అమానుషంగా దాడి చేసిన ఘటనకు సంబంధించి కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘ విచారణల తర్వాత.. ఆసిఫాబాద్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావ్ తో పాటు మరో ఏడుగురిని దోషులుగా నిర్ధారిస్తూ న్యాయస్థానం జైలు శిక్ష ఖరారు చేసింది.కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సార్సాల అటవీ అధికారులపై దాడి కేసులో 7 ఏళ్ల తర్వాత తీర్పు వెలువడింది. 2019లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం 8 మంది నిందితులను దోషులుగా నిర్ధారించి, ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది. 2019 జూన్ 30న ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కొత్త సార్సాలలో అటవీ భూమిలో మొక్కలు నాటేందుకు అధికారులు సిబ్బంది వెళ్లారు. దీంతో అక్కడి గ్రామస్థులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అప్పటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చోళే అనిత నేతృత్వంలోని బృందంపై కొందరు వ్యక్తులు కర్రలతో దాడి చేయగా, ఎఫ్.ఆర్.ఓ అనితతో పాటు పలువురు అటవీ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. అటవీశాఖ సిబ్బందిపై దాడి ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మొత్తం 39 మందిపై హత్యాయత్నం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, దాడి, తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు పూర్తిచేసి 2020లో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా 300 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఆసిఫాబాద్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావ్, భూరం పోసం, పుల్ల శ్రీకాంత్, కొట్ట మల్లేష్, బొబ్బర శంకర్, రాజశేఖర్, భూరం మల్లేష్,

# భూ వివాదాల పరిష్కారానికి కోర్టునే ఆశ్రయించాలి

### కొడిమ్యాల ఎస్.ఐ.నరేష్ కుమార్




**నవగీతం, కొడిమ్యాల:** కొడిమ్యాల మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల వ్యవసాయ భూమి గట్టు వివాదం నేపథ్యంలో పలువురు రైతులు పరస్పరం వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకుని గొడవలకు దిగిన ఘటనలో ఇరుపక్షాలపై కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు ఎస్.ఐ ఎ. నరేష్ కుమార్ తెలిపారు.ఈ ఘటనలో తదుపరి ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు చట్టంలోని నిబంధనల మేరకు సంబంధిత వ్యక్తులను మండల తహసీల్దార్ (ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్) ఎదుట బైండ్ ఓవర్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా మండల ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎస్.ఐ. నరేష్ కుమార్ విజ్ఞప్తి చేస్తూ, వ్యవసాయ భూములు, గట్టు పంచాయతీలు, భూ యాజమాన్యానికి సంబంధించిన వివాదాలు తలెత్తినప్పుడు వాటిని చట్టబద్ధంగా సంబంధిత న్యాయస్థానాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఇటువంటి భూ వివాదాలకు పోలీస్ స్టేషన్ వేదిక కాదని, గొడవలు, దాడులు, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని.ఎస్.ఐ.ఎ.నరేష్ కుమార్ హెచ్చరించారు.


# ధర్మపురి డిగ్రీ కళాశాలకు 29 మంది అధ్యాపకులకు నియామకానికి గ్రీన్ సిగ్నల్..

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అడ్లూరి..

**నవగీతం, ధర్మపురి:**రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన కీలక అంశానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ధర్మపురికి మంజూరైన డిగ్రీ కళాశాలకు 29 మంది అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ధర్మపురి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలో మూతబడిన నైట్ కళాశాలను తెరిపించడంతో పాటు నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ధర్మపురికి డిగ్రీ కళాశాలను మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి హిందుస్థాన్ ఏరోనాటికల్ సంస్థ సీఎస్ ఆర్ నిధులు రూ.10 కోట్ల నిధులు ఇవ్వడానికి ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు.తాజాగా ధర్మపురి డిగ్రీ కళాశాల సిబ్బంది నియామకానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శుక్రవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ధర్మపురి డిగ్రీ కళాశాలకు 29 పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ధర్మపురి డిగ్రీ కళాశాలకు 29 పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపినందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ధర్మపురి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు వేదికలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం:

### సమగ్ర అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం






**నవగీతం ?తల్లాడ ప్రతినిధి** తల్లాడ మండల రైతు వేదికలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మండల శ్రీ హరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాబోయే మూడేళ్ల (2026-29) 'తెలంగాణ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక' అమలుపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు అవగాహన కల్పించారు. అలాగే 'ఎదీ+=ూవీజు' ప్రాజెక్ట్ అంశాలతో పాటు, గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు కీలకమైన 'ఘన వ్యర్థాల నిర్వహణ' (ూఔవీ) విధానాలపై శిక్షకులు శ్రీ పరశురామ్ సమగ్రంగా వివరించారు.?ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల సర్వాంగీణ సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా రూపొందించిన ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరుస్తూ, చెత్త నిర్వహణపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అల్పపీడనం... పలు ప్రాంతాల్లోవానలు

**హైదరాబాద్ :** వాయవ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీనికి తోడు కోస్తాంధ్ర, తెలంగాణ మీదుగా మహారాష్ట్ర వరకు ప్రస్తుతం ద్రోణి విస్తరించి ఉంది. ఈ మార్పుల ప్రభావంతో శుక్రవారం ఏపీ వ్యాప్తంగా ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణశాఖ అధికారులు స్పష్టం చేశారు. గంటకు 40- 50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. వర్షం కురుస్తున్నప్పుడు, ఉరుములు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని, తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యంతో పాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు

# భారీ వాహనాలను బైపాస్ రోడ్డుకు మళ్లించాలి

### గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి



**నవగీతం, కొడిమ్యాల ప్రతినిధి:**జగిత్యాల జిల్లా కొడిమ్యాల మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు కొడిమ్యాల గ్రామానికి చెందిన రాచకొండ చంద్రమోహన్ వినతిపత్రం సమర్పించారు. కొడిమ్యాల ప్రధాన రహదారిలో స్థానిక అంగడి బజార్ నుంచి బస్టాండ్ వరకు ఇటీవల లక్షల రూపాయల వ్యయంతో కొద్ది రోజుల క్రితం నూతన సీసీ రోడ్డు నిర్మించిన నేపథ్యంలో, ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నిలిపివేసి బైపాస్ రోడ్డు ద్వారా మళ్లించాలని వారు కోరారు.ప్రధాన రహదారిపై నిరంతరం భారీ వాహనాలు సంచరించడం వల్ల పాదచారులు, విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంగడి బజార్ నుంచి బస్టాండ్ వరకు అనేక దుకాణాలు, చిరు వ్యాపారులు ఉండటంతో భారీ వాహనాల వల్ల దుమ్ము, దూళి పెరిగి ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని పేర్కొన్నారు.అంతేకాకుండా ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా అధికంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.భారీ వాహనాల రాకపోకల కారణంగా కొద్దిరోజుల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందని బైపాస్ రోడ్డును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి, అంగడి బజార్--బస్టాండ్ ప్రాంతంలో భారీ వాహనాలు ప్రవేశించకుండా అడ్జస్టబుల్ బారికేడ్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.ఈ అంశంపై సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం తక్షణమే స్పందించి ప్రజల భద్రతతో పాటు ప్రభుత్వ నిధులతో నిర్మించిన రహదారిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం చంద్రమోహన్ రెడ్డి సురువు శ్రీనివాస్ టింకు తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్



**నవగీతం రాయికల్ ప్రతినిధి** :ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున రాయికల్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్ ఆధ్యర్యంలో స్థానిక కౌన్సిలర్లు మరియు నాయకులతో కలిసి స్థానిక బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ఓటర్ నమోదు పక్రియను పరిశిలించి మిగిలిన వాటిని కూడ పూర్తి స్థాయిలో చేయగలరని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి,కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్, నాయకులు కొయ్యాడి మహిపాల్ రెడ్డి,బత్తిని నాగరాజు,కట్కం సాయి,జిల్లాల సుధాకర్,సతీష్ రెడ్డి మరియు బి ఎల్ ఓ లు పుష్పలత, రాజేశ్వరి,సుమలత పాల్గొన్నారు

# పంట సాగులో యజమాన్య పద్ధతులపై అవగాహన



**నవగీతం, రాయికల్ ప్రతినిధి:** ఆపత్కాల పంటల ప్రణాళిక పై అవగహన కార్యక్రమం లో బాగంగా వరికి ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుము, జొన్న, సజ్జలు, రాగి వేసుకోవచ్చని పంట సాగులో వాడవాల్సిన ఎరువుల గురించి, పురుగుల తెగుళ్ల సమస్యలు మరియు వాటి నివారణ పద్ధతుల గురించి, అదే విధంగా కూరగాయల పంటలైన ఉల్లి, బీర, కాకరసాగులో పాటించవలసిన మెలకువల గురించి వివరించడం జరిగింది. అదే విధంగా రాంరెడ్డి మొక్కజొన్న, టమాటో పంట పొలాలను సందర్శించి పురుగుల నివారణ గురించి, యాజమాన్యం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస నుండి శాస్త్రవేత్తలు డా.పి.రవి,డా.కే. రాజేష్, డా.కే.స్వాతి, డా.కే. రామక్రిష్ణ, డా.వై.స్వాతి, అగ్రి హబ్ రూరల్ కోఆర్డినేటర్ దివ్యశ్రీ, గ్రామ సర్పంచు స్వామి,పాక్స్ చైర్మన్ రాజారెడ్డి,అభ్యుదయ రైతులు మాజీ సర్పంచ్ రాంరెడ్డి గారు,రాజు లక్ష్మినారాయణ, తిరుపతి,గంగారెడ్డి, శేఖర్, మల్లారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

## తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న మంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజుల రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు.మంత్రి త్వరగా కోలుకోవాలని అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు మంత్రి వాకిటి

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
18 జూలై 2026

# వివాదంలో ఆర్ ఎస్ ప్రవీణ్




**అదిలాబాద్ :** కొద్దిరోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద.. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు.. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ముఖ్యంగా గురుకులాల విషయంలో ప్రవీణ్ తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. వేలకోట్ల కుంభకోణం జరిగిందని.. ఇదంతా రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర అని ప్రవీణ్ కుమార్ మండిపడుతున్నారు. రోజుల వ్యవధిలోనే అనేకసార్లు విలేకరుల సమావేశం నిర్వహించి.. ముఖ్యమంత్రిని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ పార్టీ నుంచి కాకుండా భారతీయ జనతా పార్టీ నుంచి కౌంటర్ వచ్చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకుడు గువ్వల బాలరాజు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు.. గురుకులాల నిర్వహణ.. నిధుల ఖర్చు ఇటువంటి వాటిపై గువ్వల బాలరాజు కీలకమైన ఆధారాలు బయటపెట్టారు. 2013 నుంచి 2021 మధ్యకాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పనిచేసినప్పుడు భారీగా అక్రమాలు జరిగాయని.. దాదాపు పదివేల కోట్ల వరకు ప్రజాధనం పక్కదారి పట్టిందని గువ్వల బాలరాజు ఆరోపించారు. ఈ మేరకు తాను ముఖ్యమంత్రికి ఒక లెటర్ రాశారు. టెండర్ ప్రక్రియలు మొత్తం పక్కన పెట్టి.. నిధులను సంతానికి మళ్ళించుకున్నారని బాలరాజు ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ సాగించాలని ఆయన డిమాండ్ చేశారు.కేవలం ప్రవీణ్ కుమార్ ను మాత్రమే కాకుండా.. నాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును కూడా బాలరాజు న్యాయపరంగా లక్ష్యంగా చేసుకున్నారు. నాడు జరిగిన అక్రమాలకు కేసీఆర్ మద్దతు ఉందని.. ఆయన సపోర్టుతోనే ఇవన్నీ జరిగాయని బాలరాజు ఆరోపించారు. ఐపీఎస్ కేడర్ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన గురుకుల సెక్రటరీ విధులను ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ కు ఏకంగా 10 సంవత్సరాల పాటు అప్పగించడం వెనక ఉన్న నిజాలు ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా ప్రవీణ్ సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మరోవైపు బాలరాజు ముఖ్యమంత్రికి రాసిన లేఖ.. చేసిన విమర్శలపై ప్రవీణ్ కుమార్ కూడా ఆదే స్థాయిలో స్పందించారు. ఇదంతా అబద్ధమని అన్నారు. కేవలం ఎనిమిది వందల కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న గురుకులాలలో వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రవీణ్ ప్రశ్నించారు.. బడ్జెట్ పరిమితులను దృష్టిలో పెట్టుకొని ఆరోపణలు చేయాలని బాలరాజుకు చూపించారు. బాలరాజు చేసిన ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి.. బండి సంజయ్.. బాలరాజు తను లక్ష్యంగా చేస్తున్నారని.. ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి తాను భయపడనని ఆయన స్పష్టం చేశారు .

### పురుషులను గౌరవించడం మన సంప్రదాయం'..

# ఫ్రీ బస్ వేళ ఆర్టీసీ బస్సులో ఇంట్రెస్టింగ్ బోర్డు



**నల్గొండ :** ఆర్టీసీ బస్సులో 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో సూర్యాపేట రూట్ బస్సులో తీసిందిగా ప్రచారం జరుగుతుండగా.. దీనిపై నెటిజన్లు సరదాగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ఈ బోర్డు నిజమైనదా లేదా ఏఐ, డిజిటల్ ఎడిటింగ్‌తో రూపొందించారా అనే విషయంపై స్పష్టత లేదు. తెలంగాణ ఆర్టీసీ కూడా ఇప్పటివరకు దీనిపై అధికారికంగా స్పందించలేదు.తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సులు, ప్రయాణాలకు సంబంధించిన పోస్టులు, మహిళల కొట్లాటలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఓ ఆర్టీసీ బస్సులో కనిపించిన బోర్డు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా బస్సుల్లో కనిపించే 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం' అనే సందేశానికి బదులుగా ' పురుషులను గౌరవించడం మన సంప్రదాయం ' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.ఈ ఫొటో సూర్యాపేట రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సులో తీసింది అని పలువురు నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. దీంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. "ఇన్నాళ్లకు మాకు కూడా గౌరవం దక్కింది", "ఇకపై బస్సులో సీటు దొరికే అవకాశముంది" అంటూ కొందరు పురుషులు సరదాగా ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఈ బోర్డు నిజంగా ఆర్టీసీ ఏర్పాటు చేసిందా లేక ఎవరైనా సరదాగా మార్చారా అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈ ఫొటో నిజమైందా కాదా అనేది మాత్రం స్పష్టత లేదు. కొందరు నెటిజన్ల అభిప్రాయం ప్రకారం.. అసలు బోర్డుపై ఉన్న స్త్రీలను అనే పదాన్ని డిజిటల్ ఎడిటింగ్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో 'పురుషులను'గా మార్చి సోషల్ మీడియాలో వైరల్ చేశారని పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఈ బోర్డు నిజమైందా లేక ఎడిట్ చేసిందా అనే దానిపై తెలంగాణ ఆర్టీసీ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉన్న నేపథ్యంలో బస్సుల్లో సీట్ల కొరత, ప్రయాణ అనుభవాలపై ఇప్పటికే సోషల్ మీడియాలో అనేక మీమ్స్, ట్రోల్స్, పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఈ బోర్డు కూడా వైరల్ కావడంతో.. మరోసారి చర్చనీయాంశంగా మారింది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి ఫొటోను నిజమని నమ్మే ముందు అధికారిక సమాచారం కోసం వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సాఫ్ట్ వేర్ నుంచి సాగువైపు



**నిజామాబాద్ :** నేటి తరం యువత చదువు పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనో.. లక్షలు ఖర్చు చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా, లండన్ వంటి విదేశాలకు వెళ్లాలనో కలలు కంటుంది. కానీ.. తెలంగాణకు చెందిన ఒక సాధారణ రైతు బిడ్డ మాత్రం ఆ గ్లామరస్ ఐటీ ప్రపంచాన్ని, విదేశీ అవకాశాలను కాలదన్ని తాను పుట్టిన మట్టిలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. నిజామాబాద్ జిల్లా చింతలూరు గ్రామానికి చెందిన సంజనా రెడ్డి సరికొత్త అగ్రి ఎంట్రపెన్యూర్‌గా మారి నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆమె సక్సెస్ జర్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా.. లక్షలాది మంది నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.సంజనా రెడ్డి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత మంచి ఐటీ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. కానీ ఆ ఉద్యోగంలో చేరలేదు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లాలనే లక్ష్యంతో ఎఇఋూ, ఉఖీఇ పరీక్షలు రాసి, మంచి స్కోర్‌తో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీలో అడ్మిషన్ కూడా సాధించింది. అంతా సిద్ధమై అమెరికాకు పయనమయ్యే సమయంలో ఆమె తనను తాను ఓ ప్రశ్న వేసుకుంది. 'ఉన్నత చదువుల కోసం నా సొంత ఊరిని, దేశాన్ని విడిచి విదేశాలకు ఎందుకు వెళ్లాలి ? నేను చదువుకున్న చదువును, టెక్నాలజీని ఇక్కడే నా కళ్ల ముందే ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎందుకు ఉపయోగించకూడదు ?' అని ఆలోచించింది.
తాను ఒక రైతు బిడ్డ కావడంతో చిన్నతనం నుండి రైతులు పడే కష్టాలను, నష్టాలను సంజన కళ్లారా చూసింది. నెలల తరబడి ఎండనక, వాననక కష్టపడి పంట పండిస్తున్నప్పటికీ దళారీల వల్ల, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని గ్రహించింది. ఈ సమస్యకు టెక్నాలజీ, వ్యాపార ఆలోచనలతో చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తను రోజూ పొలంలో చేసే పనులను, వ్యవసాయ జీవన విధానాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. అలా ఆమె పోస్ట్ చేసిన పసుపు సాగు గురించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియో తెచ్చిన క్రేజ్‌తో ప్రజలు నేరుగా తమ పొలం నుంచే స్వచ్ఛమైన పసుపును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.ఈ ఊహించని అవకాశాన్ని వ్యాపారంగా మార్చుకుంటూ ఆమె 'ఇందూరు ఫార్మ్స్' అనే ఈ-కామర్స్ స్టార్టప్‌ను ప్రారంభించింది. రైతుల నుంచి పంటను నేరుగా ఎటువంటి దళారీల ప్రమేయం లేకుండా మంచి ధరకు కొనుగోలు చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా వినియోగదారులకు డెలివరీ చేయడం ప్రారంభించింది. నేడు ఈమె వ్యాపారం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై వంటి దేశంలోని ప్రధాన మెట్రో నగరాలకు విస్తరించింది.సంజన విజయగాథపై సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఎక్కడ పుట్టిందో.. ఆ మూలాల నుంచే ఎదగాలని నిర్ణయించుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకమని అంటున్నారు. నిజమైన మార్పు ఎప్పుడూ మూలాల నుంచే మొదలవుతుందని.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఇంత పెద్ద వ్యాపారాన్ని నిర్మించడం అద్భుతమని, తాను జీవితాంతం చూసిన సమస్యకు టెక్నాలజీతో పరిష్కారం కనుగొన్న సంజన నిజమైన ఎంట్రప్రెన్యూర్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. రైతు కూతురిగా మొదలైన ఆమె ప్రయాణం.. నేడు వందలాది మంది రైతులకు దిక్సూచిగా మారిందని ప్రశంసిస్తున్నారు. నిజంగా సంజనా ప్రయాణం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం.

## డీ లిమిటేషన్ బిల్లుకు కాంగ్రెస్ సపోర్టా....

**హైదరాబాద్ :** తెలంగాణా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మరో రెండు టెర్ములు తనదే అధికారం అని ప్రతీ సభలో చెబుతూ ఉంటారు. రాసి పెట్టుకోండి అని ఆయన అంటున్నారు. ఇక తాజాగా ఆయన ఖమ్మం సభలో అయితే మీడియాకు నంబర్ చెప్పి మరీ మాకు 2029 లో వచ్చే సీట్లు ఇవ్వే లెక్క కరెక్ట్ అని పక్కాగా చెప్పారు. మాకు 117 సీట్లు వస్తాయని ఆయన అన్నారు. తెలంగాణాలో సీట్లు 182 దాకా పెరుగుతాయని అందులో 117 ఒక్క కాంగ్రెస్ కే సొంతంగా వస్తాయని ఆయన స్పష్టం చేశారు. : ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డిని ఎవరు తక్కువగా అంచనా వేసినా పప్పులో కాలేసినట్లే అని అంటున్నారు. అలాగే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేతలు లైట్ తీసుకున్నారు. దానికి గానూ ఏకంగా భారీ మూల్యం చెల్లించి గద్దె దిగాల్సి వచ్చింది. మరి ఇపుడు చూస్తే రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు. ప్రభుత్వం నడుపుతున్నారు. పైగా కాంగ్రెస్ అధినాయకత్వం వద్ద ఆయనకు మంచి పేరు ఉంది. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఆయనకే ఓటు వేస్తున్నారు. దాంతో మరో రెండు సార్లు కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకుని వస్తామని రేవంత్ తన వద్ద ఉన్న అంచనాలతోనే చెబుతున్నారు: తెలంగాణాలో ప్రస్తుతం 119 సీట్లు ఉన్నాయి. అవి ఏకంగా 182 దాకా అవుతాయని రేవంత్ రెడ్డి లెక్క కడుతున్నారు. ఇలా సీట్లు మరో డెబ్బై దాకా పెరిగితే అది కాంగ్రెస్ ప్రభుత్వానికే అనుకూలిస్తుంది అని ఆయన భావిస్తున్నారు. ఎపుడూ అధికారంలో ఉండే పార్టీకే ఈ సీట్ల పెరుగుదల అడ్వాంటేజ్ గా ఉంటుంది అని అంటున్నారు. 2009 లో అసెంబ్లీ సీట్ల పునర్ విభజన వైఎస్సార్ కి బాగా కలిసి వచ్చింది. ఇపుడు కూడా రేవంత్ రెడ్డి అదే జరుగుతుందని భావిస్తున్నారు అంటున్నారు.ఇక రాజకీయంగా చూస్తే వ్యతిరేక ఓట్లు భారీగా వచ్చే ఎన్నికల్లో చీలిపోతాయని కూడా రేవంత్ రెడ్డి అంచనా కడుతున్నారు. విపక్షంలో బీజేపీ బీఆర్ఎస్ రెండూ పోటా పోటీగా ఉన్నాయి. ఈ రెండూ కలిసేది లేదు అని అంటున్నారు. కలుస్తాయని అందుకే పెద్ద ఎత్తున రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. ఇదంతా వ్యూహాత్మకం అని అంటున్నారు. ఈ రెండు పార్టీ కలిసినా అప్పటికి అది బూమరాంగ్ అవుతుందని విడిగా పోటీ చేస్తే కనుక కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీని పంచుకుంటాయని దాంతో మరోసారి గెలుపు బాట కాంగ్రెస్ దే అని రేవంత్ రెడ్డి పూర్తి ధీమాతో ఉన్నారు అని అంటున్నారు.

## గొర్రెలు, మేకలకు ఉచిత పిపిఆర్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం



**నవగీతం, మల్లాపూర్:** పశుసంవర్ధక శాఖ, జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో రాఘవపేట గ్రామంలో గొర్రెలు మరియు మేకలకు పెస్ట్ డెస్ పెటిట్స్ రుమినెంట్స్ (ూా= ) వ్యాధి నివారణకు ఉచిత టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ తోట శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రామచంద్రుడు, సహాయ సంచాలకులు హాజరు అయి కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని గొర్రెలు, మేకల పెంపకదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ జీవాలకు టీకాలు వేయించుకున్నారు. టీకా కార్యక్రమాన్ని పశువైద్యులు శాస్త్రీయ విధానంలో నిర్వహించి, ప్రతి ఆరోగ్యవంతమైన గొర్రె మరియు మేకకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగా టీకాలు అందించారు.ఈ సందర్భంగా పశువైద్య శస్త్రవైద్యులు డా. నరేష్ రెడ్డి గడ్డం మాట్లాడుతూ, పిపిఆర్ అనేది గొర్రెలు మరియు మేకలకు సోకే అత్యంత ప్రమాదకరమైన వైరల్ వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి సోకిన జంతువులలో అధిక జ్వరం, కళ్ల మరియు ముక్కు నుండి నీరు కారడం, నోటిలో పుండ్లు, తీవ్ర విరేచనాలు, శ్వాసకోశ ఇబ్బందులు, ఆహారం తినకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. సమయానికి నివారణ చర్యలు తీసుకోకపోతే అధిక మరణాలు సంభవించి పశుపాలకులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని తెలిపారు.
డాక్టర్ రామచంద్రుడు, సహాయ సంచాలకులు మాట్లాడుతూ పిపిఆర్ వ్యాధికి సమర్థవంతమైన నివారణ మార్గం సకాలంలో టీకాలు వేయించడం మాత్రమే అని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం చేపట్టిన ఈ ఉచిత టీకాల కార్యక్రమాన్ని ప్రతి గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకొని తమ గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.టీకాల అనంతరం జంతువులకు పరిశుభ్రమైన నీరు, పోషకాహారం అందించాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప పశు వైద్యశాలను లేదా పశువైద్య అధికారులను సంప్రదించాలని సూచించారు.
ప్రభుత్వం పశుసంపద సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పలు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని తెలిపారు. పశుపాలకులు పశువైద్య శాఖతో సహకరించి తమ పశుసంపదను వ్యాధుల నుండి రక్షించుకోవాలని కోరారు.
అనంతరం పశు వైద్యాధికారులకు సర్పంచ్, ఉప సర్పంచ్ ఘనంగా సన్మానం చేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్, ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, భైరి రవి కుమార్ యాదవ్, బైర రాజ్ కుమార్, భైరి రాకేష్,బక్కన్న, బొర్రన్న, ఎర్రన్న,వార్డ్ సభ్యులు చిట్యాల నర్సయ్య, రాము, పశుసంవర్ధక శాఖ సిబ్బంది రవి, మోహన్, రాజేందర్, లక్ష్మి నారాయణ, హుస్సేన్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## భూ రీ సర్వే తో భూ సంబంధిత సమస్యలు పరిష్కారం



**నవగీతం,మల్లాపూర్ :** జగిత్యాల జిల్లా భూభారతి కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో చేపడుతున్న భూ రీ సర్వే తో భూ సంబంధిత సమస్యలు పరిష్కారం అవుతాయని తాసిల్దార్ రామ్ చందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండంపల్లి గ్రామంలో భూభారతి భూ రిసర్వే కార్యక్రమం పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమికి సంబంధించిన గ్రామ హద్దులు ఇతరత్రా సమస్యలు భూ రిసర్వే తో పరిష్కారం అవుతాయని అన్నారు. గ్రామ హద్దులను ఏర్పాటు చేసి రీ సర్వే వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈయన వెంట ఆర్ఐ అశోక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**నవగీతం, మల్లాపూర్** మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ శంకుస్థాపన చేశారు. కాగా సర్పంచ్ తో పాటు పిఅర్ ఎ ఇ రాగసుధ, కార్యదర్శి వినీత, పాలకవర్గ సభ్యులు, భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళ సంఘ సభ్యులకు భవనం నిర్మించుకోవడానికి రూ.10 లక్షలు మంజూరు చేసిందని మహిళా సంఘ సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గనవేని నందిని, కార్యదర్శి వినీత, కారోబార్ సుధాకర్ వార్డు సభ్యులు కలసాని రాజన్న, కత్తి నరేష్, బాస రాజరెడ్డి, బొల్లారపు పుష్ప నాయకులు నల్ల రాజేశం, సురకంటి తిరుపతి రెడ్డి, మూడంపల్లి రమేష్, రాజోజి సాయిరాం, బండారి వెంకటేష్ మాజీ సర్పంచులు నిమ్మల భూమారెడ్డి, రంగు రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రలకు నేతలు..

**హైదరాబాద్ :** మరో ఏడాది తర్వాత తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పాదయాత్రల సందడి మొదలుకానుంది. ఎన్నికలకు ముందు ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రధాన పార్టీలు మరోసారి పాదయాత్రలను ప్రధాన రాజకీయ ఆయుధంగా ఎంచుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు రెండేళ్ల ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతానని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు తెలంగాణలో వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రధాన పార్టీలు ప్రజలతో నేరుగా మమేకమయ్యే వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టమవు

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.